Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699



# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 91 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 10 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015


## భగవంతునికి భక్తుడికి మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తా : సుమంత్ రెడ్డి



**న్యూఢిల్లీ :** ఢిల్లీ టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడిగా ఎదుగుండ్ల సుమంత్ రెడ్డి ఈరోజు (గురువారం) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సుమంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడిగా ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. భగవంతునికి భక్తునికి మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తానని అన్నారు. ఢిల్లీ టీటీడీ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఢిల్లీలో స్వామి వారి భక్తులకు ఎప్పటికప్పుడు స్వామివారి కార్యక్రమాలు తెలియజేస్తానని.. తిరుమలలో స్వామివారికి జరిగే కైంకర్యాలు ఢిల్లీ టీటీడీ ఆలయంలో జరిగేలా చూస్తానని వెల్లడించారు. తెలుగువారు, శ్రీవారి భక్తులతో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ఆలయానికి కావలసిన వసతులు ఏర్పాటు చేస్తానన్నారు. ఏపీ భవన్‌లో టీటీడీ కౌంటర్ మళ్ళీ అందుబాటులోకి తీసుకు వస్తానని సుమంత్ రెడ్డి పేర్కొన్నారు.

**అలా చేస్తే ఉపేక్షించం: మాధవ్**

కాగా.. ఈ కార్యక్రమంలో ఏపీ బీజేపీ అధ్యక్షులు మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని టీటీడీ లోకల్ అడ్వైజర్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సుమంత్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా వెంకటేశ్వర స్వామి వైభవాన్ని తెలియజేసే విధంగా టీటీడీ అనేక రకాల దేవాలయాలను నిర్మిస్తోందన్నారు. తిరుమల తిరుపతిలో శ్రీవారికి ఎలాంటి సేవలు జరుగుతాయో ఢిల్లీలో కూడా అలాంటి సేవలు కొనసాగిస్తామని వెల్లడించారు. ఏపీ భవన్‌లో ఉన్న టీటీడీ దర్శన కౌంటర్‌ను తిరిగి పునప్రారంభిస్తామని ప్రకటించారు. టీటీడీ పవిత్రకు ఎక్కడ భంగం కలిగించిన ఉపేక్షించే పనిలేదని స్పష్టం చేశారు. టీటీడీ వైభవం మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు. టీటీడీ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ కృషి చేస్తోందని మాధవ్ వెల్లడించారు.

## గుడ్ న్యూస్.. భారీగా పోలీస్ ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్..!




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగులకు పోలీస్ శాఖ త్వరలోనే శుభవార్త అందించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పోలీసు శాఖ భర్తీకి కసరత్తు చేస్తోంది. వివిధ డిపార్ట్‌మెంట్‌లలో అంటే సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వ్, ఏపీఎస్పీ, సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో ఉన్న ఉద్యోగ ఖాళీలను పూర్తి చేసేందుకు నిమగ్నమైంది. ఈ మేరకు ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర సర్కారుకు డీజీపీ పంపించారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిశీ లించి అనుమతి ఇవ్వగానే ఉద్యోగ భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అయితే డీజీపీ కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ.. పంపించిన లేఖలో ఉద్యోగ ఖాళీలను ప్రస్తావించింది. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు, 3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ పోస్టులు, 2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల భర్తీకి అనుమతించాలని కోరింది. సర్కార్ నుంచి అనుమతి వచ్చిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ రిక్రూట్‌మెంట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు సమాచారం. కాగా, ఆగస్టు 31వ తేదీ వరకు రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో గుర్తించిన ఖాళీలను మాత్రమే ప్రభుత్వానికి డీజీపీ పంపించారు. రాష్ట్రంలో రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయని, నేరస్తులు కొత్త కొత్త విధానాల్లో నేరాలు చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కట్టుదిట్టం చేయాలంటే పోలీస్ ఫోర్స్ అవసరం ఉందని, అందుకోసం తాము విజ్ఞప్తి చేసిన పోస్టులను వీలైనంత త్వరగా భర్తీ చేసి నోటిఫికేషన్ ఇచ్చేందుకు అనుమతినివ్వాలని డీజీపీ విన్నవించారు.

## వైద్య సేవలు బంద్.. స్పందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. రేపటి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు కింద వైద్యం అందించే అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలను నిలిపివేయనున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. అసోసియేషన్ ప్రకటన ప్రకారం, తమకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల గత్యంతరం లేక ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. పలు మార్లు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని, మంత్రి సత్యకుమార్ యాదవ్ అసెంబ్లీలో బకాయిలు విడుదల చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. నిర్వహణ ఖర్చులు పెరిగిపోయినా, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఆసుపత్రులు నష్టపోతున్నాయని పేర్కొంది. ఇక రేపటి నుంచి అన్ని రకాల వైద్య సేవలు నిలిపివేయక తప్పదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు.




ప్రజలు ఇబ్బందులు పడతారని, ఆసుపత్రులు సేవలు ఆపవద్దని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం రూ. 2,500 కోట్ల బకాయిలు ఉంచిందని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత విడతల వారీగా చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. ఆసుపత్రులు ఎదుర్కొంటున్న కష్టాలు ప్రభుత్వానికి తెలుసన్న మంత్రి, ఈ అంశంపై ఈరోజే సీఎం చంద్రబాబును కలిసి చర్చిస్తామన్నారు.

## రాయవరం బాణాసంచా పేలుడుపై దర్యాప్తుకు ప్రభుత్వం ఆదేశం

**అమరావతి, (రాజధాని వార్తలు):** బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా పేలుడుపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సమగ్ర దర్యాప్తునకు ఉన్నతస్థాయి కమిటీ నియమిస్తూ సర్కార్ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు గురువారం నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ నేతృత్వంలో దర్యాప్తు కమిటీని నియమించింది. దర్యాప్తు కమిటీ సభ్యుడుగా ఐ.జి. ఆకే రవికృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడికి కారణాలను అన్వేషించాలని ఆదేశాల్లో వెల్లడించింది. దుర్ఘటనకు బాధ్యులు ఎవరో తేల్చాలని తెలిపింది. ఈ తరహా ఘటనలు జరగకుండా నివారణ చర్యలు సిఫార్సు చేయాలని ఆదేశించింది. వారంలోగా అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది. విచారణ కమిటీకి సహకరించాలని కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీకి ప్రభుత్వం ఆదేశించింది.






## త్వరలోనే ఆర్డీటీపై పాజిటివ్ వార్త : మంత్రి పయ్యావుల



**అమరావతి, (రాజధాని వార్తలు):** జీఎస్టీ తగ్గింపు ఫలాలు సామాన్యులకు చేరాలని జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురు వారం నాడు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. పేదలకు ఉపయోగపడే అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించామని తెలిపారు. దీని ద్వారా ప్రతి కుటుంబానికి రూ.18 వేలు నుంచి 20 వేలు ఆదా అవుతోందన్నారు. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ అనుమతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా మాట్లాడారని మంత్రి తెలిపారు. ఇటీవల జరిగిన సమావేశంలో చంద్రబాబు ఈ అంశంపై కేంద్రమంత్రి అమిత్ షా తో మాట్లాడారని.. పేదలకు మంచి చేస్తున్న ఆర్డీటీ గురించి త్వరలో మంచి వార్త వింటారని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి చీప్ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. మెరుగైన సేవలు కోసమే పీపీపీ మోడల్ అని స్పష్టం చేవారు. ప్రపంచం ఓ వైపు పోతుంటే జగన్.. ఏపీని వెనక్కి లాగాలని చూస్తున్నారని విమర్శించారు. ఊరందరిదీ ఓ దారి అయితే ఉలిపిరికట్టది ఓ దారి అన్న చందంగా జగన్ తీరు ఉందంటూ మంత్రి ఎద్దేవా చేశారు. అంతుకుముందు..సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌లో భాగంగా మెడికల్ షాపుల్లో ధరలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఆనంద్ పరిశీలిం చారు. మెడికల్ షాపుల్లో గతంకంటే తగ్గిన ధరలను మంత్రి కేశవ్ చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలను ఎక్కడ ప్రైవేటీకరణ చేయడం లేదన్నారు. పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేయడం కోసం మరింత మెరుగైన సేవలు అందించడానికి ఈ ప్రయత్నమన్నారు. చీప్ పాలిటిక్స్ చేయడం జగన్ మార్చుకోవాలని.. పీపీపీ మోడల్ అనేది సరైన నిర్ణయమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు జిల్లా పర్యటన అనేది సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌లో భాగమని మంత్రి పయ్యువుల కేశవ్ పేర్కొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికల వేళ.. తేజస్వీ కీలక ప్రకటన

**పట్నా :** బిహార్ అసెంబ్లీకి ఎన్నికల నగారా మోగింది. అధికారం కోసం ప్రజలపై రాజకీయ పార్టీల నేతలు, అధినేతలు హామీల వర్షం కురిపిస్తున్నారు. అలాంటి వేళ.. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ రాష్ట్ర ప్రజలకు కీలక హామీ ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక తాటిపైకి వచ్చిన ఇండి కూటమి అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలో ప్రతి ఇంటిలో ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. ఈ ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన 20 రోజుల్లోనే అందుకు సంబంధించిన చట్టం తీసుకు వస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం బిహార్ రాజధాని పాట్నాలో తేజస్వీ యాదవ్ వెల్లడించారు. బిహార్‌లో జాబ్ లేకుండా ఏ ఇల్లు ఉండడానికి వీల్లేదన్నారు. ఈ రోజు తాను చేసింది.. చారిత్రాత్మక ప్రకటనగా ఆయన అభివర్ణించారు. బిహార్‌ను ప్రగతి పథంలో ఎలా తీసుకు వెళ్లాలంటూ అంతా ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకో లేదని కాస్తా ఘాటుగా విమర్శించారు. ఇంకా చెప్పాలంటే..గత 20 ఏళ్లుగా నిరుద్యోగంపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదని ఆరోపించారు. దీంతో ఈ సమస్య అతిపెద్దదిగా మారిందన్నారు. అయితే ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన జేడీయూ కానీ.. బీజేపీ కానీ ఉద్యోగాలపై ప్రజలకు హామీలు ఇవ్వడం లేదని చెప్పారు. కానీ నిరుద్యోగ భృతిపై మాత్రం ఆయా పార్టీలు హామీలు ఇస్తున్నాయని ఎద్దేవా చేశారు. బిహార్‌లో ప్రభుత్వ ఉద్యోగం లేని కుటుంబాలకు.. ఈ కొత్త చట్టం ద్వారా అవకాశం లభిస్తుందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటైన 20 నెలల్లోనే..



ప్రభుత్వ ఉద్యోగం లేని ఇల్లు బిహార్‌లోనే ఉండదని తెలిపారు. ఇది తన ప్రతిజ్ఞగా తేజస్వీ యాదవ్ అభివర్ణించారు. అదీకాక బిహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఆ క్రమంలో సామాజిక న్యాయంతోపాటు బిహార్ ప్రజలకు ఆర్థిక న్యాయం కూడా అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇస్తున్నామన్నారు. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటికి రెండు దశల్లో..నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు నవంబర్ 14వ తేదీన జరగనుంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు, ఇండి కూటమిలోని పార్టీలతోపాటు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ స్థాపించిన జన సురజ్ బరిలో దిగనుంది. మరి ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి బిహార్ ఓటర్లు పట్టం కట్టారనేది తెలియాలంటే మాత్రం నవంబర్ 14వ తేదీన తేలనుంది.

## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా చేస్తోంది

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు జీఓ 9పై హైకోర్టు స్టే విధించడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు స్పందించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా చేస్తోందని ఆరోపించారు. 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటు పడిందా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే మీ ఢిల్లీ నేతలతో పోరాటం చేయండి.. కలిసి రావడానికి బీఆర్ఎస్ సిద్ధమని హరీష్‌రావు తెలిపారు. బీసీ రిజర్వేషన్‌లో కీలకమైన జీవోనెం.9పై హైకోర్టు స్టే విధించింది. బీసీ రిజర్వేషన్‌కు సంబంధించి హైకోర్టులో నిన్నటి నుంచి కొనసాగుతన్న వాదనలు ఇవాళ్టితో ముగిసాయి. ఈ క్రమంలో విచారణ చేపట్టిన న్యాయస్థానం జీవో నెం.9పై స్టే విధిచింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. దీంతో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది. జీవో నెం.9 స్టే నేపథ్యంలో బీఆర్ఎస్ బడా లీడర్లు.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవడానికి ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం.

# ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్





**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల విధులను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అమలు, ఎన్నికల ప్రక్రియ నిర్వహణ వంటి అంశాలపై ఆయన అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి తన బాధ్యతను కట్టుదిట్టంగా, సమన్వయంతో నిర్వర్తించాలని సూచించారు. ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎంసీసీ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, వాటి ఉల్లంఘనకు పాల్పడిన వారిపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సెన్సిటివ్ మరియు హైపర్ సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించి సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. మండల కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు వంటి ప్రక్రియలపై సంబంధిత సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓలు) కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి అభ్యర్థులు తమ నామినేషన్ ఫారాలను ముందుగానే తనిఖీ చేసుకునే సౌకర్యం కల్పించాలని సూచించారు. రిటర్నింగ్ ఆఫీసర్లు స్వీకరించిన నామినేషన్లను అదే రోజు టిఇ-పాల్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, ప్రతి రోజు సాయంత్రం నాటికి రోజువారీ నివేదికలు సమర్పించాలని ఆయన ఆదేశించారు. తహసీల్దార్లు (మండల ఎం సి సి నోడల్ అధికారులు) ఎస్ ఎస్ టి, ఎఫ్ ఎస్ ఎస్బృందాల నివేదికలను సేకరించి జిల్లా నోడల్ అధికారులకు పంపాలని సూచించారు. జెడ్ పి టి సి నామినేషన్ల ప్రక్రియ సంబంధిత ఆర్ డి ఓ / సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగుతుందని తెలిపారు.తుది అభ్యర్థుల జాబితా ప్రకటించిన తర్వాత బ్యాలెట్ పేపర్ తయారీ మరియు ముద్రణను తెలుగు వర్ణమాల క్రమంలో ఖచ్చితత్వంతో నిర్వహించాలన్నారు. పోలింగ్ సామాగ్రిని కేంద్రాల వారీగా వేరు చేసి భద్రంగా ఉంచాలని ఎంపీడీఓలను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ర్యాలీలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్ల వినియోగానికి సంబంధించి ఎస్ యాచ్ ఓ / సి ఐల నుండి అనుమతులు తప్పనిసరిగా పొందాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి అక్టోబర్ 11వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు జరగనుంది. అక్టోబర్ 12న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 13న అప్పీల్ స్వీకరణ, అక్టోబర్ 14న అప్పీల్ విచారణ జరగనున్నట్లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు అక్టోబర్ 15వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఉండగా, అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారని వివరించారు.

జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, చట్టబద్ధంగా, సమన్వయంతో నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నోడల్ అధికారులు అన్ని పోలింగ్ కేంద్రా లను సందర్శించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలా అడ్డుకుంటారో చూస్తామంటే మక్కెలు విరగ్గొట్టి మూలన కూర్చోబెడతాం - జగన్ టూర్ పై గంటా మాస్ వార్నింగ్





**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** శాంతి భద్రతలకు విఘాతం కలిగిం చేలా 63 కిలో మీటర్ల పొడవున రోడ్డు మార్గాన టూర్ చేస్తాం, ఎవరు అడ్డుకుంటారో చూస్తామంటే ప్రభుత్వం ఊరుకోదని.. మక్కెలు విరగ్గొట్టి లోపల కూర్చోపెడతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వైసీపీకి వార్నింగ్ ఇచ్చారు. ఎంవీపీ కాలనీ లోని క్యాంప్ కార్యాలయంలో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ చట్టానికి ఎవరూ అతీతులు కాదని, వ్యవస్థలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పారు. దర్శి, సత్తెనపల్లి, నెల్లూరు, అనంతపురంలలో జగన్ పర్యటనలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ.. భద్రతా కారణాలరీత్యా నర్సీపట్నం పర్యటనకు హెలికాప్టర్ లో వెళ్లాలని పోలీస్ యంత్రాంగం సూచిస్తే దాన్ని రాజకీయం చేయాలని జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అనంతరపురం జిల్లా రాప్తాడు పర్యటనకు హెలికాప్టర్‌లోనే వెళ్లిన జగన్ ఇప్పుడు ఎందుకు వద్దంటున్నారని నిలదీశారు. తమిళ్ హీరో విజయ్ పర్యటనలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 40 మంది మృతి చెందారని.. మరోపక్క అంతర్జాతీయ మహిళ క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గురువారం ఉదయం విశాఖ వచ్చి సాయంత్రం 4.30 గంటలకు బెంగుళూరు ప్యాలెస్‌కు వెళ్లిపోయే వీకెండ్ పొలిటీషియన్‌గా జగన్‌ను అభివర్ణించారు. వైసీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు ఇంటికి తాళాలు వేసినట్టు.. చంద్రబాబు పరామర్శకు వెళ్తున్న పవన్ కల్యాణ్ ను అడ్డుకున్నట్టు.. తామూ చేయగలమని, అయితే ప్రజాస్వామ్యాన్ని గౌరవించే రాజకీయ పార్టీ కావడం వల్ల ఎవరి హక్కులు హరించే ఉద్దేశం తమకు లేదన్నారు.

**కోటి సంతకాలు దేని కోసమో చెప్పాలి**

అధికారంలో ఉన్న అయిదేళ్లలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పూర్తి చేయని జగన్మోహన్ రెడ్డి.. వాటిని పూర్తి చేయాలని ఇప్పుడు కోటి సంతకాలు సేకరించడం హాస్యాస్పదంగా ఉందని గంటా అన్నారు. 26 జిల్లాల్లో కోట్లాది రూపాయలతో వైసీపీ పార్టీ కార్యాలయాలు కట్టుకున్న జగన్ తాను పూర్తి చేయలేని నర్సీపట్నం మెడికల్ కాలేజీ సందర్శనకు వెళ్లడం విడ్డూరంగా ఉందని తెలిపారు. మెడికల్ కాలేజీల విషయంలో ఏమాత్రం నిబద్ధత ఉన్నా..రూ. 450 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టకుండా నర్సీపట్నం మెడికల్ కాలేజీ పూర్తి చేసి ఉండేవారని వ్యాఖ్యానించారు. వైసీపీ హయంలో నాణ్యమైన మద్యం అందించామని జగన్ చెప్పడం జోక్ ఆఫ్ ద ఇయర్‌గా ఎద్దేవా చేశారు. తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ రాకూడదనే ఉద్దేశంతో చనిపోయిన రైతు పేరుతో కోర్టులో కేసు వేసి.. వైసీపీ నాయకులు ఆత్మరక్షణలో పడ్డారని చెప్పారు. అధికారంలో ఉండగా స్టీల్ ప్లాంట్ కార్మిక నాయకులకు అపాయింట్మెంట్ ఇవ్వని జగన్మోహన్ రెడ్డి ఏం ముఖం పెట్టుకుని స్టీల్ ప్లాంట్‌కు వెళ్తారన్నారు. అభివృద్ధి, విజన్‌లకు చంద్రబాబు.. అరాచకానికి, అవినీతికి జగన్మోహన్ రెడ్డి.. బ్రాండ్ అంబాసిడర్లుగా పేర్కొన్నారు.

**విశాఖ అభివృద్ధి అడ్డుకునేలా వైసీపీ తీర్మానం**

విశాఖ అభివృద్ధిని ఆపడానికి ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు ఇటీవల పెద్దిపాలెంలోని చెన్నా ఫంక్షన్ హాల్లో రహస్యంగా సమావేశం కావడం సిగ్గు చేటన్నారు. గూగుల్, బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ, అర్సెల్లాల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి పరిశ్రమల భూ సేకరణ అడ్డుకోవాలని ఆ సమావేశంలో తీర్మానించారని ఆరోపించారు. వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలను అడ్డుకుని ఏం సాధిస్తారని, ఉత్తరాంధ్రపై చూపించే ప్రేమ ఇదేనా అని నిలదీశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లొడగల అప్పారావు, పిల్లా మంగమ్మ, చిక్కాల విజయ్ బాబు, గాడు అప్పలనాయుడు, జనసేన నాయకుడు శాఖారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలలో సూపర్ జి ఎస్ టి - సూపర్ సేవింగ్స్ కార్యక్రమం






**భీమిలి, (రాజధాని వార్తలు):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో ప్రజలమీద ఉండే ఆర్థిక భారం తగ్గించడం కోసం జి ఎస్ టిలో మినహాయింపు చాలా భరోసాను ఇస్తుందని భీమిలి నోడల్ అధికారి వర్మ అన్నారు. భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం సూపర్ జి ఎస్ టి - సూపర్ సేవింగ్స్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ పి. రాంప్రసాద్ సమక్షంలో భీమిలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం కేంద్రంలో ఎన్ డి ఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయని అన్నారు. జి ఎస్ టి మినహాయింపు కారణంగా అన్ని రకాల వస్తువులపై ధరలు బాగా తగ్గాయని, నిత్యావసర వస్తువుల ధరలపై కూడా సామాన్యులకు భారం తగ్గిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎంపిడిఓ కె. వి. నరసింహారావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి. కె. సూరిబాబు, సాయి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో, పాఠశాలల్లో పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు

## - ప్రత్యేక అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఇటీవల కురుపాం గురుకుల పాఠశాల వసతి గృహంలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వసతి గృహాల్లో, పాఠశాలల్లో పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. ఆయా మండల, జోనల్ ప్రత్యేకాధికారులు వసతి గృహాలను, పాఠశాలలను సందర్శించాలని, అక్కడి పరిస్థితులను పరిశీలించి నివేదించాలని ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. తాగునీటి పైప్ లైన్లు లీకులను సరిచేయాలని, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకుల నుంచి అనుసంధానమయ్యే పైపులను పరిశీలించాలని, ఎక్కడైనా లోపాలుంటే సరిచేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, డెంగ్యూ ఇతర సీజనల్ వ్యాధుల పట్ల అందరినీ అప్రమత్తం చేయాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్ శాఖల పరిధిలోని వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఐటీఐ, పాలిటెక్నిక్, గురుకులాలు, కేజీబీవీల్లోని తాజా పరిస్థితులను పరిశీలించి నివేదించాలని ఆయా ప్రత్యేకాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# బస్ షెల్టర్ ఏర్పాటు చేయరూ... !



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక జాతీయ రహదారి పక్కన గల గణేష్ టెంపుల్ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఎం భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నిత్యము ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ పాయింట్ వద్ద షెల్టర్ లేని కారణంగా ఎండకి, వర్షానికి తడుస్తూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం భారీ వర్షానికి ప్రయాణికులు తడుస్తూ బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఈ పరిస్థితినితాను ప్రత్యక్షంగా చూసి బస్ షెల్టర్ కోసం విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఎం.పీ.డీ.వో ఈ విజ్ఞప్తిని పరిశీలనగా తీసుకొని, బస్సు షెల్టర్ మంజూరు చేయాలని కోరారు.

# అన్ని వర్గాలకు అండగా కూటమి సర్కార్ : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** ప్రజల కష్టాలను తీర్చడమే అజెండాగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం పదికాలాలు వర్థిల్లాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. దసరా సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం ద్వారా ఒక్కొక్కరికి 15,000 రూపాయలు ఇవ్వడం శుభపరిణామమని గంటా నూకరాజు అన్నారు. ప్రజల సంక్షేమం కోసం, వారి కష్టాలను తీర్చడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందో ఈ పథకం ద్వారా స్పష్టమవుతుందని ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం ప్రణాళిక రూపొందిస్తుందని, కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు సర్కార్ పేదల కష్టాలను తీర్చడమే ధ్యేయంగా పని చేస్తుందని అన్నారు. గత వైసిపీ ప్రభుత్వంలో ఆటో కార్మికులను అడుగడుగునా అడ్డుకొని దొంగ కేసులు పెట్టి వేధించేవారని అడ్డూ అదుపు లేకుండా వేసిన కేసుల కారణంగా ఆటోల మీద ఆదారపడి జీవించే నా సోదరులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని రోడ్లు సరీగా లేక నెలకు రెండు లేక మూడు సార్లు మెకానిక్ షెడ్డులకు తీసుకొని వెళ్లి రిపేర్లు చేసుకొనేవారని కష్టపడిన డబ్బులు ఆటోలు రిపేర్లు చేయడానికే సరిపోయేవని అన్నారు. కానీ నేటి మనందరి ఫ్రెండ్లీ కూటమి ప్రభుత్వంలో అలాంటి ఆరాచకాలు లేవని, ఇబ్బందులు ఉండవని కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లన్నీ మరమ్మతులు చేయించడంతో ఆటో రిపేర్లు తగ్గాయని గంటా నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు వియ్యపు పోతురాజు, శీరం గురుమూర్తి, వాసుపల్లి కొండ, రేగాని శ్రీను స్వామి, ఎర్రా రాము, గుడ్డాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు వెంటనే రద్దు చేయాలి



**విశాఖపట్నం గాజువాక పెద్ద గంట్యాడ, (రాజధాని వార్తలు):** గాజువాక పెదగంట్యాడ గ్రామంలో సిమెంట్ ఫ్యాక్టరీ అనుమ తులు వెంటనే రద్దు చేయాలి అని నిరసన తెలుపుతున్న గ్రామ ప్రజలు 10 లక్షలు మంది ప్రాణాలు కాపాడాలి.. అక్టోబర్ 8న పెద్దగంట్యాడ ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర జరిగే ప్రజా అభిప్రాయ సేకరణను అడ్డుకోవాలి.. స్థానిక ఎమ్మెల్యే ఎంపీ కార్పొరేటర్లు స్పందించి ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని తల్లడిల్లి పోతున్న ప్రజలు ఫ్యాక్టరీలు పెడితే ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అమాంతం పెరిగిపోతాయని చెబుతున్న లెక్కలు అసత్యాల మాటలు అన్న సంగతి ఎక్కడ ప్రజలకు తెలిసింది అధికార, ప్రతిపక్ష,వామపక్ష తేడాలు లేకుండా అంబుజ సిమెంట్ బుధవారం పెద్దగంట్యాడ వల్ల నెరవేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని చెబుతున్నారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు అలాగే పల్లా కార్తీక్ మరియు సిపిఎం నాయకులు అలాగే స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొమరిపాలెం గ్రామంలో బాణాసంచా పేలుళ్ల ఘటనపై చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర విచారం

## - ప్రభుత్వం వెంటనే క్షతగాత్రుల కుటుంబాలను అదుకోవాలి



**కొమరపాలెం, (రాజధాని వార్తలు):** రాయవరం మండలం కోమరపాలెం గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో బాణాసంచా ప్రేలుడు దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విచారం వ్యక్తం చేసిన డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. ఈ ఘటన ఆందోళనకరమని, క్షణాల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాల దుఃఖంలో తాను భాగస్వామినయ్యానని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిగా విచారించి, నిర్లక్ష్యం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గాయపడిన వారికి తక్షణ వైద్యం అందించి, బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం కల్పించాలని సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి అని జగ్గిరెడ్డి తెలిపారు.

# సూపర్ జి. ఎస్.టి సూపర్ సేవింగ్స్ క్యాంపెయిన్ విస్తృతం చేయాలి

## - సదరం క్యాంపులకు లబ్ధిదారు హాజరు తప్పనిసరి
## - టి.సిలో స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** సూపర్ జి.ఎస్.టి సూపర్ సేవింగ్స్ క్యాంపెన్‌లో విస్తృతంగా కార్యక్రమాలను నిర్వహించాలని, లక్ష్యాల మేరకు ఏ రోజు కార్యక్రమాలను ఆ రోజే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి ఆదేశించారు. సచివాలయాలతో మాపింగ్, షెడ్యూల్ చేయడం, డాక్యుమెంటేషన్, చెస్8న కార్యక్రమాలను అప్లోడ్ చేయడం తప్పనిసరిగా జరగాలన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఛాంపియన్స్‌గా ఉన్న సచివాలయ సెక్రటరీలు, ఎం.పి.డి.ఓలు, మున్సిపల్ కమిషనర్లు కార్యక్రమాలను డాక్యుమెంటేషన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. బుధ వారం కలెక్టర్ సూపర్ జి ఎస్ టి కాంపెయిన్, ఈ క్రాప్ నమోదు, సదరం క్యాంపులపై అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ జి ఎస్ టి పై పరిశ్రమల శాఖ ద్వారా ఎం.ఎస్.ఎం.ఈ లలో ఎక్సిబిషన్లు నిర్వహించాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో సూపర్ జి ఎస్ టి పై అవగాహనా తరగతులను నిర్వహించి, విద్యార్థులకు పోటీలను కూడా నిర్వహించాలని తెలిపారు. పోటీల వివరాలను, విజేతలు వివరాలను కూడా అప్లోడ్ చేయాలని తెలిపారు. వైద్య శాఖ ద్వారా ప్రైవేటు ఆసుపత్రుల వద్ద, ఫార్మా కంపెనీ ల వద్ద సూపర్ జి ఎస్ టి సూపర్ సేవింగ్స్‌పై పోస్టర్లు, ఏర్పాటు చేయడం, వర్క్ షాప్‌లు నిర్వహించడం చేయాలన్నారు. ఈ క్రాప్ నమోదు ఈ నెల 25 లోపల పూర్తి చేయాలని, అందుకోసం వ్యవసాయ అధికారులకు మండల రెవిన్యూ అధికారులు, సర్వేయర్లు సహకరించాలని తెలిపారు. వ్యవసాయేతర, ప్రభుత్వ భూములన్నింటిని నమోదు చేయవలసి ఉందని, ఈ విషయంలో రెవిన్యూ అధికారుల భాగస్వామ్యం ముఖ్యమైనదని అన్నారు.

**సదరం క్యాంపులకు లబ్ధిదారు హాజరు తప్పనిసరి**

వికలాంగ పెన్షన్ల పునర్ మూల్యాంకనలో భాగంగా, అర్హత తక్కువగా నిర్ధారించబడిన వారు అప్పీలు చేసిన సందర్భాల్లో వారికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సదరం శిబిరాలు అక్టోబర్ 8వ తేదీ నుండి ప్రారంభమవు తున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. కలెక్టర్ పేర్కొన్న దానిలో వైద్య ఆరోగ్య శాఖ ఈ శిబిరాల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసిందని, అప్పీల్ చేసిన వికలాంగుల వివరాలను సంబంధిత ఆసుపత్రులకు మ్యాపింగ్ చేసి, ఎంసీపీడీఓ లాగిన్లలో నోటీసులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎంసీపీడీఓలు తక్షణమే జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారా సంబంధిత లబ్ధిదారులకు నోటీసులు తప్పనిసరిగా అందజేయాలని ఆయన ఆదేశించారు. క్యాంపునకు లబ్ధిదారు హాజరు కాకపోతే వారికి పింఛన్ అందే పరిస్థితి ఉండదని తెలియజేయాలన్నారు. అదే విధంగా, ఆసుపత్రి సూపరింటెండెంట్లు శిబిరాల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని, అక్టోబర్ 8వ తేదీ నాటికి వైద్య బోర్డు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వికలాంగుల సౌకర్యార్థం ఆసుపత్రులలో తాగునీరు, కూర్చునే సదుపాయం వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం సున్నితమైనదని దృష్టిలో ఉంచుకుని, శిబిరాలు సాఫీగా మరియు మానవీయంగా సాగేలా చూడాలి. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే జిల్లా స్థాయిలో సంప్రదించండి, అని కలెక్టర్ రాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్





**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** కొత్తగూడెంలో ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్నారుల హాజరు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పర్యవేక్షణ, విద్యా కార్యక్రమాల అమలు విధానాలను సమీక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, పిల్లలకు సమయానికి ఆహారం, పాలు, గుడ్లు అందజేయాలని ఆదేశించారు. అలాగే, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు అందించే పోషకాహార పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా అనే విషయంపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ భవనం పరిశుభ్రత, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, నేర్చుకునే సామగ్రి వాడకం తదితర అంశాలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతి అంగన్‌వాడీ కేంద్రం బాలల సమగ్రాభివృద్ధికి కేంద్ర బిందువుగా మారాలని, పిల్లల శారీరక, మానసిక ఎదుగు దలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో అంగన్వాడీ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో దీపావళి టపాసుల అక్రమ స్థావరాలపై టాస్క్ ఫోర్స్, భద్రాచలం పోలీసుల సంయుక్త దాడులు







**భద్రాచలం, (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు దీపావళి టపాసుల అక్రమ నిల్వలపై ఈ రోజు జిల్లా టాస్కోఫోర్స్ మరియు భద్రాచలం పోలీసులు సంయుక్తంగా దాడులను నిర్వహించడం జరిగింది. భద్రాచలం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీ, ఇండస్ట్రీయల్ ఏరియా మరియు గ్యాస్ గౌడన్ ఏరియాలలో జనావాస ప్రాంతాలలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన నలుగురు వ్యక్తులపై భద్రాచలం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడమైనది. సుమారుగా పది లక్షల రూపాయల విలువ గల దీపావళి టపాసులను స్వాదీనం చేసుకున్నారు.ఎవరైనా అనుమతులు లేకుండా, నియమ నిబంధనలను పాటించకుండా దీపావళి టపాసులను అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని భద్రాచలం సీఐ నాగరాజు తెలిపారు. ఈ విధంగా నివాస ప్రాంతాలలో ఉంచిన నిల్వల వలన గతంలో చాలా చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించి అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ప్రజాహితార్థం ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది.ఎవరైనా ఈ విధంగా టపాసులను అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 నకు గానీ,స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందించాలని టాస్కోఫోర్స్ ఇన్స్పెక్టర్ రమాకాంత్ మరియు సీఐ నాగరాజు కోరారు. ఇట్టి దాడులలో టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# చింతకుంట శ్రీనివాసులు సంస్మరణ సభలో ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు రామచంద్ర



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కష్టనష్టాల్లో తాను ఉంటానంటూ భరోసా ఇచ్చే పేదల పెన్నిధి లాయర్ చింతకుంట శ్రీనివాసులు సంస్మరణ సభలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు తాలేటి రామచంద్ర అన్నారు. నెల్లూరు టౌన్ హాల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నెల్లూరు జిల్లా కార్యదర్శి నరసింహుల నాయుడు అధ్యక్షతన బుధవారం సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి తాలేటి రామచం ద్రయ్య మాట్లాడుతూ చింతగుంట రమణయ్య రమణమ్మలకు జన్మించిన మొదటి సంతానం చింతకుంట శ్రీనివాస్‌లు అన్నారు. తన తండ్రి బోరు వేసే పనిలో తను కూడా సహాయకులుగా ఉండేవాడు, తన మేనమామ కూతుర్ని వివాహం చేసుకొని కష్టాలు కన్నీళ్లు లెక్క చేయక కుటుంబం కోసం చెక్క బండి రిక్షాని తొక్కి జీవనం కొనసాగించేవాడని అన్నారు. ఈ క్రమంలో సిపిఎం పార్టీ జిల్లా ఆనాటి కార్యదర్శి భానురాజు సహకారంతో ఇంటర్ చదివి, అనంతరం ఐదు సంవత్సరాలు లాయరుగా చదివి పట్టా అందుకున్నారు. పేదవాళ్ళ పక్షపాతిగా, బలహీన వర్గాల పక్షాన తరువాత వినిపించేవారు. లాయర్‌గా జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తూ, హైకోర్టు లాయర్‌గా తన ప్రాక్టీస్ మొదలుపెట్టారు. తను అందరివాడని, పేద కోసం తన వంతు సహాయం చేసే నిజమైన కష్టజీవిని కొనియాడారు. ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంబెటి శ్రీనివాసులు, బీఎస్పీ నాయకులు, మాజీ ఉద్యమ నేత కొండయ్య, బీసీ రాష్ట్ర అట్రాసిటీ కమిటీ మెంబర్, మాట్లాడుతూ లాయర్ కుటుంబానికి తన చేతనైన సాయం తప్పక చేస్తారని హామీ ఇచ్చారు. చింతకుంట శ్రీనివాసు మరణించడం తమకెంతో బాధగా ఉందని సిపిఐ నాయకులు లీలా మోహన్, నాగేంద్ర, కన్నీళ్లు పెట్టుకున్నారు, విద్యార్థి ఉద్యమ నేత జేఏసీ నాయకులు, ఆదిత్య సాయి శ్రీనివాసులు తనతో ఉన్న స్నేహ బంధాన్ని చక్కగా వివరించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ మిత్రులతో కలిసి తన చేతన ఎంత సహాయం చేస్తానని పేర్కొన్నారు. లాయర్ అనిల్ మాట్లాడుతూ లాయర్‌గా తమ వంతు తమ ఇప్పటికే కృషి చేశామని మళ్లీ కూడా ఆ కుటుంబానికి సాయి పడతామని తెలిపారు. కామేశ్వరరావు మాట్లాడుతూ చింతకుంట శ్రీనివాసులు తనది ఒకే కులమైనప్పటికీ, వయసు ఒకటే అయిన ప్పటికీ, సార్ అని గౌరవంగా సంబోధించే మంచివారని కొనియాడారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సృజన సంస్థ ఫౌండర్, రిటైర్డ్ జడ్జ్ రాధాకృష్ణ మాట్లాడుతూ లాయర్లుగా కళాకారులతో సంబంధం అనేది చాలా అరుదని, తమతో కలిసిమెలిసి సరదాగా ఉండేవారని అటువంటి మంచి లాయర్‌ని కోల్పోవటం దురదృష్ట కరమని బాధపడ్డారు. నెల్లూరు వెంకటరత్నం మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి తను ఎరుగుదునని, మంచివారు లేకపో వటం ట్రంకు రోడ్డు సెంట్రల్ వెలవెలబోతుందని బాధ పడ్డారు.

# శాస్త్ర సాంకేతిక పురోగాభివృద్ధి అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన ఈ సదస్సులో స్వాగత ఉపన్యాసంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.బాలాజీరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో 14 హై స్కూల్స్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, అన్ని పాఠశాలలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, ఆట స్థలాలు ఏర్పాటు చేశారని తెలిపారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఈ స్థాయికి చేరుకున్న వారేనని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి నిదర్శనంగా ప్రతి విద్యా సంవత్సరంలో పురోగతి సాధిస్తున్నామని, 2023 - 75. 61%, 2024 - 88.17%, 2025-83.58% సాధించడంతోపాటు రాష్ట్రంలోనే 13వ స్థానంలో 85.10 శాతంతో నెల్లూరు టౌన్ నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ హమీద్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలను మించిన సూపర్ స్టార్లు లేరు, అసలైన హీరోలు శాస్త్రవేత్తలని అభిప్రాయం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల అభ్యున్నతి కోసం గొప్ప కార్యక్రమం చేపట్టామని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారుడు, డిఆర్డిఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి సతీష్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రామేశ్వరంలోని చిన్న గ్రామంలో ప్రభుత్వ పాఠశాల చదివారని, విద్యతోనే గొప్ప శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతి అయ్యారని తెలిపారు. అదేవిధంగా తాను కూడా గవర్నమెంట్ స్కూలు మహిమలూరు పాఠశాల, విఆర్ కాలేజీలో చదివానని, అబ్దుల్ కలాం వేసిన బీజం వల్ల ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిందని విద్యార్థులకు వివరించారు. మున్సిపల్ విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన కోసం యుద్ధ ట్యాంక్‌ను ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తానని తెలియజేశారు. స్వదేశీ ఆలోచనలతో రూపొందించిన ఆత్మ నిర్భర్ భారత్ ఆయుధాలతో భారత్ వివిధ యుద్ధాలలో గొప్ప విజయం సాధించిందని తెలియజేశారు. బ్రహ్మోస్ క్షిపణిని రష్యాతో కలిసి తయారు చేశామని, బ్రహ్మోస్‌లో సొంతంగా రూపొందించిన సాఫ్ట్వేర్ ఉందని సతీష్ రెడ్డి తెలియజేశారు. బ్రహ్మోస్ క్షిపణితో పాక్‌పై విజయం సాధించామని, భారత దేశానికి ఎటువంటి నష్టం కలగలేదని వివరించారు. భారతదేశంలో క్షిపణులకు నాంది పలికింది అబ్దుల్ కలాం అని, ఈనెల అక్టోబర్ 15న ఆయన పుట్టినరోజు వేడుకలను అన్ని పాఠశాలలో ఘనంగా జరుపుకోవాలని సతీష్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి రాత్రింబవళ్లు కష్టపడి చదవాలని, స్కూలుకు మంచి పేరు తేవాలని, నెల్లూరుకు, రాష్ట్రానికి తద్వారా దేశానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మాధురి, డిప్యూటీ డి.ఇ.ఓ నాయక్, నెల్లూరు అర్బన్ ఎం.ఈ.ఓ.లు తిరపాల్, హమీద్, వివిధ స్కూల్స్‌కు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ప్రజాస్వామ్య భరోసానివ్వని బిహార్ సర్

బిహార్ ఓటర్ల తుది జాబితాలు వెలుడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల తేదీలూ ప్రకటించారు. పూర్తయిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - సర్) కార్యక్రమాన్ని నిశితంగా పరీక్షిస్తే మా దృష్టికి వచ్చిన వాస్తవాలను వివరించడమే ఈ వ్యాస లక్ష్యం. కొత్త ఓటర్ జాబితాల నాణ్యతను అంచనా వేసేందుకు గాను ఓటర్ల నమోదు కార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయిలో అంగీకారయోగ్యమైన మూడు మార్గదృక సూత్రాలను ప్రాతిపదికగా తీసుకున్నాం: సమగ్రత, నిష్పాక్షికత, నిర్దుష్టత. తొలుత ఓటర్ జాబితా సమగ్రతను చూద్దాం. ఓటర్ జాబితాలో చోటు చేసుకున్న అర్హులైన జనుల నిష్పత్తిని దీనికి కొలమానంగా తీసుకున్నాం. గత జూలైలో ప్రచురితమైన ముసాయిదా ఓటర్ జాబితాలలో చోటుచేసుకున్న వయోజనుల నిష్పత్తి ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో దిగ్భ్రాంతికరంగా 97 శాతం నుంచి 88 శాతానికి తగ్గిపోయింది. తుది ఓటర్ల జాబితాలో కొంతమేరకు మెరుగుదల కనిపించినప్పటికీ, విస్తృత పరిశీలనలో పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదని స్పష్టమయింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కారణంగా ఓటర్లకు - జనాభాకు మధ్య నిష్పత్తి గణనీయంగా పడిపోయింది మరి. భారత ప్రభుత్వ నిపుణుల బృందం విడుదల చేసిన జనాభా అంచనాల ప్రకారం సెప్టెంబర్ 2025లో బిహార్‌లో 8.22 కోట్ల మంది ఓటర్లు ఉండాలి. తుది ఓటర్ జాబితాలో ఉన్నవారు 7.42 కోట్లు మాత్రమే! అంటే దాదాపు 80 లక్షల మంది సంభావ్య ఓటర్లు తుది జాబితాలో కనిపించడం లేదు! ఇదేమంత సంతోషించదగిన విషయం? దీన్నెలా అంగీకరించాలి? తుది ఓటర్ జాబితాలు భ్రమపూరితమైన ఉపశమనాన్ని మాత్రమే కలిగిస్తున్నాయి. ఎందుకని? తుది జాబితా నుంచి తొలగింపులు ముసాయిదా జాబితాల నుంచి తొలగించబడిన 65 లక్షల కంటే తక్కువ కాబట్టి. నిజానికి రెండు కోట్ల మంది ఓటర్లు తొలగింపుకు గురవుతారని భయపడ్డాము. అంత పెద్ద సంఖ్యలో ఓటు హక్కు తొలగింపులు సంభవించలేదంటే అందుకు కారణం 'సర్' గానీ, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కానీ కాదు. దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్రమత్తత వల్లే అటువంటి అప్రజాస్వామిక చర్య చోటుచేసుకోలేదు. సుప్రీంకోర్టు కృతనిశ్చయంతో 'సర్' అమలును పర్యవేక్షించింది. గౌరవ భంగం కాకుండా ఉండేందుకు ఈసీఐ తన ఆదేశాలకు, కార్యనిర్వహణ పద్ధతులకు భిన్నంగా వ్యవహరించింది. తొలుత ఎన్యూమరేషన్ ఫామ్‌లను సమర్పించని ఓటర్లు పెద్ద సంఖ్యలో లేరనే వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు కచ్చితంగా ప్రయత్నించింది. ఈ ప్రకారం కనీసం 20 శాతం ఎన్యూమరేషన్ ఫామ్‌లను బీఎల్‌ఓలే నింపి ఈసీఐకు సమర్పించడం జరిగింది. ఈ ఫోర్జరీని ఈసీఐ ప్రోత్సహించింది. పిదప సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆధార్ కార్డును ఓటర్ నమోదుకు ఒక ప్రామాణిక పత్రంగా ఈసీఐ అంగీకరించింది. తుది జాబితాలలో నిష్పాక్షికత ఉన్నదా? ఓటు హక్కుకు అర్హులైన జనాభాలో తమ నిష్పత్తికి సమరీతిలో అన్ని సామాజిక బృందాలకు ప్రాతినిధ్యం లభించిందా? దళితులకు, వచ్చిపోయే వలసకారులకు ఈ విషయంలో న్యాయం ఏ మేరకు జరిగిందీ? వీటిపై మరింత నిశిత శోధన జరగవలసివున్నది. మహిళలు, ముస్లింలకు న్యాయం జరగలేదన్నది మా పరిశీలనలో స్పష్టంగా వెల్లడయింది. బిహార్ ఓటర్ జాబితాలలో మహిళల నిష్పత్తి రాష్ట్ర జనాభాలో వారి వంతు కంటే ఎప్పుడూ తక్కువగా ఉండడం పరిపాటి. ఇటీవలి సంవత్సరాలలో ఈ అంతరం తగ్గింది. 2012లో 21 లక్షలుగా ఉండగా అది ఈ ఏడాది 7 లక్షలకు తగ్గింది. 'సర్'తో ఈ అంతరం మరింతగా తగ్గక పోగా 16 లక్షలకు పెరిగింది. ముస్లింల విషయంలో సాక్ష్యాధారాలు స్పష్టంగా లేవు. ఈసీఐ రికార్డులో ముస్లింలు ఒక అధికారిక వర్గంగా లేకపోవడమే అందుకు కారణం. అయితే పేర్ల గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించగా ఆందోళనకరమైన వాస్తవాలు వెల్లడయ్యాయి. ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి మినహాయించబడిన 65 లక్షల మంది ఓటర్లలో ముస్లింలు 24.7 శాతం కాగా తుది జాబితాల నుంచి తీసివేసిన 3.88 లక్షల పేర్లలో వారు 33 శాతంగా ఉన్నారు. రాష్ట్ర జనాభాలో వారి నిష్పత్తి 16.9 శాతంగా ఉండడం గమనార్హం. అంటే ఆరు లక్షల ముస్లిం ఓటర్ల పేర్లను అదనంగా తొలగించారు. తుది ఓటర్ జాబితాలు నిర్దుష్టంగా ఉన్నాయా? ప్రత్యేక సమగ్ర సవరణతో ఈ విషయంలో పరిస్థితి మరింత దిగజారినట్టు అర్థమవుతున్నది. 'సర్' ముందు జాబితాలు, 'సర్' తరువాతి జాబితాలలోని నిర్దుష్టతపై మరింత పరిశీలన జరగవలసి ఉన్నది. అయితే మా ప్రాథమిక విశ్లేషణ ప్రకారం ఓటర్ జాబితాలను ప్రక్షాళన చేశామన్న ఈసీఐ వాదన సమర్థనీయంగా లేదు. తుది ఓటర్ జాబితాలలో 24 వేల పేర్లు అర్థంకాని రీతిలో ఉన్నాయి. 5.2 లక్షల పేర్లు నకిలీవి. 6,000 మంది ఓటర్ల జెండర్ ఏమిటో స్పష్టంగా తెలియడం లేదు. రెండు లక్షల మంది ఓటర్ల ఇంటి నెంబర్లు సక్రమంగా లేవు. ప్రక్షాళన జరగాల్సింది ఇలాగేనా? చాలా అంశాలలో ముసాయిదా జాబితాల కంటే తుది జాబితాలు మరింత ఘోరంగా ఉన్నాయి. ఓటర్ జాబితాల నుంచి విదేశీయుల (బంగ్లాదేశీయులు, రోహింజ్యాలు అని చదువుకోండి) పేర్లను తొలగించడమే 'సర్' లక్ష్యమని బీజేపీ వాదించింది. ఈ వాదనతో ఈసీఐ ఏకీభవించింది. అయితే 'సర్'కు సంబంధించి ఈసీఐ తొలగించిన ఓటర్ల పేర్లను ఏ కారణాలతో తొలగించడం జరిగిందో రోజువారీ బులెటిన్‌లో వివరంగా తెలిపారు. అయితే ఇంటింటికి వెళ్లి ధ్రువీకరించుకున్న కార్యక్రమంలో ఎంతమంది విదేశీయులు తమ దృష్టికి వచ్చారన్న విషయమై ఎలాంటి వివరాలను ఈసీఐ వెల్లడించలేదు. విదేశీయుడు అన్న కారణంగా ఏ ఒక్క ఓటరు విషయంలోనూ బీజేపీ తన అభ్యంతరాన్ని ఈసీఐకి తెలుపలేదు. బిహార్ సీఈఓ వెబ్‌సైట్ ముసాయిదా జాబితాలకు 2.4 లక్షల ఫిర్యాదులు తమకు అందాయని పేర్కొంది.

## దేశ ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం సనాతన ధర్మమా?

### - సుప్రీంకోర్టు సిజెఐ గవాయిపై దాడి చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలి : దళిత ప్రజా సంఘాల డిమాండ్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశ అత్యున్నత నాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బాలకృష్ణ గవాయిపై హిందూ మతో న్మాది రాకేష్ కిషోర్ చేసిన దాడి హేయమైన చర్య అని ఇటువంటి దాడి దేశ ప్రజలందరూ సిగ్గుపడేలా చేసిందని పలు సంఘాలు నిరసన చేపట్టాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరసిస్తూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద బుధవారం సాయంత్రం దళిత, ప్రజా, విద్యార్థి. మహిళ, కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశాన్ని చూసి సిగ్గుపడేలా ప్రపంచ దేశాలన్నీ నివ్వెరపోయేలా మనువాద సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారనే అక్కసుతో మనదేశ ప్రధాన న్యాయమూర్తిపై హిందూ మత ఉన్మాది అయిన న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి చేయడం యావత్ దేశమంతా తలదించుకునేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత ఘోరమైన దాడి జరిగినా దేశ రాష్ట్రపతి, ప్రధాని, చట్టాన్ని రక్షించే హెూం మంత్రి ఖండించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఒక దళితుడు ప్రధాన న్యాయమూర్తిపై ఇంతటి దారుణానికి ఒడి కడతారా ఇంత అవమానానికి గురి చేస్తారా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశ ప్రధాన న్యాయమూర్తి కనుసన్నల్లో ప్రమాణ స్వీకారం చేసే ప్రజా ప్రతినిధులు ఆ న్యాయమూర్తిపై దాడి జరిగితే మౌనంగా ఉండటం వివక్ష చూపడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ మత ఉన్మాద ప్రభుత్వ మద్దతుతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. మనదేశ ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేయడమే సనాతన ధర్మ లక్ష్యమా అని వారు ప్రశ్నించారు. రాజ్యాంగం ముఖ్యమా సనాతన ధర్మమా ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడతానన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ గౌరవ ప్రదమైన రాజ్యాంగ పరిధిలో దేశప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగితే స్పందించరా అని ప్రశ్నిం చారు. ఇప్పటికైనా దేశ ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రి స్పందించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండించాలని దాడి చేసిన మతోన్మాదిని అరెస్టు చేసి కఠినంగా శిక్షిం చాలని, భారత రాజ్యాంగాన్ని రక్షించి ప్రజాస్వా మ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఏడిద రాజేష్, ఉపాధ్యక్షులు ఆకుమర్తి రవి, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిల్లెల్ల మనోహరం, అమలదాసు బాబురావు, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు కొండా దుర్గారావు, మాజీ ఏపీపీ ఐ ఎన్ మల్లేశ్వరరావు, పెనుమాల చిట్టిబాబు, సాపే బాల రవి, గిడ్ల వెంకటేశ్వరరావు, దళిత సేన జాతీయ ఉపాధ్యక్షులు దుక్కుపాటి సత్యనారాయణ, జీవీ రమణ, పెంకే వెంకటేశ్వరరావు, పీతల రామ చంద్రరావు, జి దైవ కృప, శెట్టిబత్తుల తులసిరావు, బత్తుల జాగృతి కుమార్, పి దుర్గాప్రసాద్, పి అమూల్య దేవిడ్,అంబేద్కర్, సాపే రమేష్, జి మురళి, బత్తుల సాత్విక్, బత్తుల నకుల్ రాజు, గడ్డం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు సమాజానికి నిశ్శబ్ద శక్తి స్తంభాలు : స్వామి పరిపూర్ణనంద



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** స్థానిక శ్రీ పీఠంలో స్వామి పరిపూర్ణనంద ఆధ్వర్యంలో అత్యంత పవిత్రమైన దసరా శరన్నవ రాత్రులను కనివిని ఎరగని రీతిలో కొన్ని వేల మంది మహిళలతో మన సనాతన ధర్మ పరిరక్షణ కోసం చేపట్టిన "మహా శక్తి యాగం" అద్భుత విజయం సాధించిన సందర్భంగా కాకినాడకి చెందిన ప్రముఖ వైద్యులు డా అడ్డాల సత్యనారాయణ, డా వీరభద్ర రావు, డా నర్సింగ్,చక్రవర్తి, నిమ్మకాయల వెంకటేశ్వర రావు తదితరులు స్వామిజికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి పరిపూర్ణనంద మాట్లాడుతూ "వైద్య వృత్తి సమాజంలో అత్యంత పవిత్రమైనది మరియు కీలకమైనదిగా పరిగణించబడుతుందని, మన కాకినాడ నగరంలో గత రెండున్నర దశాబ్దాలుగా ఎన్నో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఎంతో మంది ప్రజలకు ఆరోగ్య సేవలు అందించిన డా.అడ్డాల సత్యనారాయణ, డా. వీరభద్ర రావు, డా. నర్సింగ్‌లాంటి వైద్యులు కేవలం రోగులకు చికిత్స అందించడమే కాకుండా, సమాజ ఆరోగ్యం మరియు శ్రేయస్సు కోసం అనేక విధులు నిర్వర్తించారని అభినందించారు. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడటం మరియు వారికి సరైన చికిత్స అందించడం వైద్యుల ప్రథమ కర్తవ్యం అని, కష్ట సమయాల్లో మరియు అత్యవసర పరిస్థితుల్లో సామాజిక బాధ్యతను గుర్తించి, పేద, ధనిక తేడా లేకుండా ప్రతి రోగిని కరుణతో చూస్తూ సేవలు అందించాలని కోరారు. వ్యాధులు రాకుండా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు, శుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానం గురించి అవగాహన కల్పించడం, ప్రజారోగ్య కార్యక్రమాలలో భాగస్వామ్యం, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం, మరియు మహమ్మారులు, ఆరోగ్య సంక్షోభాల సమయంలో ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలబడటం, అలాగే వైద్య చికిత్సలో అత్యున్నత ప్రమాణాలను పాటించడం మరియు రోగి భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం చేయాలని కోరారు. అనాథలు, వృద్ధులకు ఉచి తంగా వైద్య చికిత్సలు అందించడం, వారికి అవసరమైన మందులు, శస్త్రచికిత్సలు అందుబాటులో ఉంచడం చేయాలని వైద్యులు సమాజానికి నిశ్శబ్ద శక్తి స్తంభాలు వంటివారన్నారు. వారు చేసే త్యాగాలు మరియు నిరంతర సేవ సమాజ ఆరోగ్యానికి పునాదన్నారు. అనంతరం స్వామి పరిపూర్ణనంద వైద్యులను ఆశీర్వదించి, ఐశ్వర్యాంబిక తల్లి ప్రసాదాలను, కడియాలను అందజేసారు.

## అంగన్వాడీల్లో ప్రీ స్కూల్ తప్పనిసరి - 16 నుంచి పోషణ కార్యక్రమాలు







**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రతి అంగన్వాడి కేంద్రంలో ప్రీస్కూలు నిర్వహణ మెరుగు పరిచి విధిగా అమలు చేయాలని, అంగన్వాడీల విధులపై ఖచ్చితమైన రిపోర్టులు అందించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆదేశించారు. సామర్లకోట పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో కాకినాడ జిల్లా పరిధిలోని ఐసిడిఎస్ సూపర్వైజర్లకు సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. సిడిపిఓ జీవస అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఈసిసిఇ, ఆర్బిఎస్కె, సీఎంఏఎం అంశాలపై ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీడీ లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి అంగన్వాడి కార్యాలయాల్లో ప్రీ స్కూల్స్‌ను తప్పనిసరిగా నిర్వహిం చవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే అంగన్వాడీలకు సంబంధించిన డేటాను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో సబ్మిట్ చేయాలన్నారు. తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే విషయంలో సూపర్వైజర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఈ మధ్యకాలంలో చిన్నారుల సైతం ఊబకాయం సమస్యలు కనిపిస్తున్నందున ఆ విషయంలో వారికి అవసరమైన పోషకాహారాన్ని అందించేందుకు ఈనెల 16వ తేదీ నుంచి పోర్షన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పీడీ చెప్పారు. దీని ద్వారా చిన్నారుల ఆరోగ్యంపై పిల్లలకు పూర్తి అవగాహన కల్పించి వారికి అందించే అవసరమైన పోషకాహారాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాడు చెప్పారు. అనంతరం సిడిపిఓ ఉష ఆధ్వర్యంలో ప్రాజెక్టు పరిధిలోని పలువురు గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంత కార్యక్రమాన్ని నిర్వహించి, పౌష్టిక ఆహారాన్ని పిడి అందజేసారు. అలాగే వారికి పలు ఆరోగ్య సలహాలను అందించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా వారికి అందుతున్న పౌష్టిక ఆహారాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం సిడిపిఓ ఉష, జిల్లాలోని సిడిపివోలు పూర్ణిమ, వై లక్ష్మి, ఏ జ్యోతి, వెంకటలక్ష్మి, పద్మావతి, శ్రీలత, దుర్గాదేవి, శ్రీదేవి, జిల్లా నుండి వివిధ ఐసిడిఎస్ కేంద్రాల సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## రాష్ట్ర క్రీడా పోటీలకు వేట్లపాలెం విద్యార్థుల ఎంపిక





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కాకినాడ డీఎస్సీ గ్రౌండ్స్‌లో సోమవారం, మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా ఎంపికల్లో వేట్లపాలెం శ్రీ కొండపల్లి గంగన్న మెమోరియల్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బీచ్ వాలీ బాల్ విభాగంలో జి.హేమంత్, పి.మహేంద్ర రాష్ట్ర స్థాయికి అర్హత సాధించగా, అండర్-14 గర్ల్స్ రగ్బీ విభాగంలో పి.లికిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. అనురాధ, విద్యా కమిటీ చైర్మన్ పి. నాగ శివ, ఫస్ట్ అసిస్టెంట్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. అలాగే పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు యార్లగడ్డ బంగార్రాజు, ఎండి. ఇబ్రహీం, శ్రీనివాస్ కృషిని గుర్తిస్తూ, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు వారిని అభినందించారు.

## ప్రభుత్వం మా సమస్యలను గుర్తించి పరిష్కారం చూపింది : ఆటో డ్రైవర్లు



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** ఆటో డ్రైవర్ సేవలో భాగంగా 679 మంది 15 వేల రూపాయలు లబ్ధిదారులు అందుకున్నారు. రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల యూనియన్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ 'ఆటో డ్రైవర్ సేవ' పథకంలో భాగంగా ఆటో డ్రైవర్లు ఒక్కొక్కరు రూ. 15,000 చొప్పున 10,185,000 ఆర్థిక సాయం అందుకున్నారు. ఈ సాయం అందినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆటో డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ, "ప్రభుత్వం మా సమస్యలను గుర్తించి పరిష్కారం చూపింది." "ఈ ఆర్థిక సాయం మా కుటుంబాలకు మేలు చేసింది." అని, "సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌కి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి ధన్యవా దాలు" తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ "ఆటో డ్రైవర్లు పట్టణ రవాణా వ్యవస్థకు వెన్నెముకలాంటివారు." అని కొనియాడారు. "వారి అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది." అన్నారు. వైసీపీ అరాచక పాలనలో ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు ప్రజాప్రభుత్వం వారి రుణభారం తగ్గించే దిశగా, అండగా ఉండేలా పథకం అమలు చేసిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్ ముందుకు సాగుతున్నారన్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒకొక్కరికీ రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందచేస్తున్నట్లు తెలిపారు. వారికి కమ్యూనిటీ భవనం కూడా అతి త్వరలోనే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట టిడిపి నాయకులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## దండి రాఘవయ్యను సన్మానించిన అంజూరు శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడిగా దండి రాఘవయ్య నియమించడం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు. మరో మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు జయ గోపాల్ కూడా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లి జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయు లింగేశ్వర స్వామి వారికి సేవ చేయడం పూర్వజన్మ సుకృతం. అదేవిధంగా దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడిగా దండి రాఘవయ్యకి రావడం తనకు సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సురేష్,ఆవులపాటి శ్రీనివాసులు, చాంద్ భాషా, అశోక్ కుమార్, తేజు, అంజూరు వెంకటేష్ రాయల్, నాగేంద్ర, రాజా, జఫ్రూల, అబ్దుల్లా, సెల్వ తదితరులు పాల్గొన్నారు.

# టాలీవుడ్ ఎవర్ గ్రీన్ కాంబో.. 27 ఏళ్ల తర్వాత ఇలా..




ఇండస్ట్రీలో కొన్ని ఎవర్ గ్రీన్ పెయిర్స్ ఉంటాయి. ఈ ఇద్దరూ జంటగా కనిపిస్తే చాలు బొమ్మ బ్లాక్ బస్టర్ అనేవారు అప్పట్లో. బిగ్ స్క్రీన్‌పై తామ ఫేవరెట్ స్టార్స్ కనిపిస్తే.. సినిమా సంపూర్ణం అయ్యిందన్న ఫీలింగ్ ఉండేది. ఇప్పటికీ అలాంటి పెయిర్స్‌ను సక్సెస్ ఫార్ములాగా మేకర్స్ యూజ్ చేస్తున్నారు. అలా తెలుగులో చాలానే ఉన్నాయి..అందులో ఒకటి అక్కినేని నాగార్జున టబు జంట ఒకటి. ఈ ఇద్దరి ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, ఆఫ్ ది స్క్రీన్‌లో ఫ్రెండ్ షిప్ సినిమాలకు ప్లస్ అయ్యేది. నాగ్, టబు జంట సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అప్పట్లో ఈ ఇద్దరి మధ్య రూమార్స్ కూడా పుట్టుకొచ్చాయి. ఇప్పటికీ టబు హైదరాబాద్ వస్తే తనను కలుస్తుందని నాగ్ కూడా గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు కూడా. రూమర్స్ ఎన్ని వచ్చిన తాము పట్టించుకోమని మా మధ్య మంచి స్నేహం ఉందని నాగ్ పలుమార్లు క్లారిటీ ఇచ్చారు. ఇక ఈ జోడీతో సినిమా చేస్తే ఇప్పుడు కూడా చూసేవాళ్లు అనేకం ఉన్నారు. నిన్నే పెళ్లాడతాలో సినిమా మాత్రం ఈ ఇద్దరి కెరీర్‌లకు హైలైట్. ఇందులో కెమిస్ట్రీ ప్రేక్షకులను కట్టిపడేంది. సిసింద్రి, ఆవిడ మా ఆవిడే వంటి బ్లాక్ బస్టర్ సినిమాల్లో నటించారు. అయితే ఆ తర్వాత మళ్లీ ఈ ఇద్దరూ స్క్రీన్ పంచుకోలేదు. ఈ జోడీ మళ్లీ ఎప్పుడు తెరపై కనిపిస్తుందా అని అక్కినేని అభిమానులు కూడా ఎదురు చూస్తున్నారు. ఇన్నేళ్లలో ఇది ఎప్పుడూ వర్కౌట్ కాలేదు. కానీ, తాజాగా మళ్లీ నాగ్ టబు కాంబోకు రూట్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నాగార్జున తన 100వ చిత్రం మొదలు పెట్టేశారు. ఈ సినిమా రీసెంట్‌గా పూజా కార్యక్రమాలతో లాంఛ్ అయ్యింది. లాటరీ కింగ్ అనే టైటిల్ ప్రచారంలో ఉంది. కానీ దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. అయితే నాగ్ కెరీర్‌లో 100వ చిత్రం కావడంతో దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. అందుకే ఈ సినిమాలోనే ఓ కీలక పాత్ర కోసం మేకర్స్ టబును సంప్రదించారని తెలుస్తోంది. ఆమె కూడా ఓకే చెప్పారని సమాచారం. దీంతో నాగ్ టబు మరోసారి వెండితెరపై కనిపించనున్నారని ఇండస్ట్రీలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఒకవేళ ఇది ఫైనలైజ్ అయితే మాత్రం ఫ్యాన్స్‌కు పండగే. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఇద్దరూ స్క్రీన్ పంచుకుంటారు. సినిమాకు కూడా ఇది హైలైట్ అవుతుందనండలో సందేహం లేదు. మరోవైపు నాగ్ రీసెంట్‌గా కుబేర, కూలీ సినిమాల్లో కనిపించారు. హీరోగా కాకుండా కొత్త పంతా ట్రై చేశారు. ఈ రెండు సినిమాల్లోనూ విభిన్న పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మరి 100వ సినిమాతో ఎలాంటి మ్యాజిక్‌ని క్రియేట్ చేస్తారో చూడాలి.


# నైజాంలో 'కొత్త' కాంతార.. ఆ క్లబ్ లోకి ఎంట్రీ..



మూడేళ్ల క్రితం సంచలన విజయం సాధించిన కాంతార మూవీకి ప్రీక్వెల్‌గా రూపొందిన కాంతార చాప్టర్ 1 సినిమా.. ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. కన్నడ ప్రముఖ నటుడు రిషబ్ శెట్టి లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన ఆ మైథలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ.. ఇప్పటికే రూ.400 కోట్ల క్లబ్ లోకి ఎంట్రీ ఇచ్చేసింది. రికార్డు స్థాయిలో వసూళ్లతో సందడి చేస్తున్న కాంతార ప్రీక్వెల్.. రూ.500 కోట్ల క్లబ్ వైపు పరుగులు పెడుతోంది. ఆరు రోజుల్లో రూ. 427.5 కోట్లు సాధించినట్లు మేకర్స్ ఇటీవల ప్రకటించగా.. ఇప్పటివరకు వరల్డ్ వైడ్‌గా రూ.475 కోట్లు సాధించినట్లు తెలుస్తోంది. వీక్ డేస్‌లో కూడా సాలిడ్ కలెక్షన్స్‌ను రాబడుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. అయితే నైజాంలో కాంతార చాప్టర్ 1.. మొదటి వారం రూ.21.8 కోట్ల షేర్‌ను సాధించినట్లు ఇప్పుడు ట్రేడ్ వర్గాల సమాచారం. కంప్లీట్ థియేట్రికల్ రన్‌లో రూ.30 కోట్లకు పైగా షేర్‌ను రాబట్టడం గ్యారెంటీగా తెలుస్తోంది. అది జరిగితే నైజాం ఏరియాలో కాంతార ప్రీక్వెల్ అరుదైన రికార్డును సొంతం చేసుకోనుంది. కేజీఎఫ్-2 సరసన చేరనుంది. కోలీవుడ్ స్టార్ హీరో యష్ నటించిన సూపర్ హిట్ మూవీ సీక్వెల్ కేజీఎఫ్-2 మూవీ.. ఎలాంటి విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. నైజాంలో ఆ సినిమా రూ.30 కోట్ల ఎక్కువ షేర్ వసూలు చేసింది. అలా రాబట్టిన ఏకైక డబ్బింగ్ సినిమాగా నిలిచింది. ఇప్పుడు కాంతార చాప్టర్ 1 కూడా కేజీఎఫ్ సీక్వెల్ ఉన్న క్లబ్‌లో కూడా చేరేలా కనిపిస్తోంది.

ఇక కాంతార చాప్టర్ 1 విషయానికొస్తే.. రిషబ్ శెట్టి సరసన రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. జయరామ్, గుల్షన్ దేవయ్య, ప్రమోద్ శెట్టి, రాకేష్ పూజారి, ప్రకాష్ తుమినాడ్, దీపక్ రామ్ పనాజీ, హరిప్రసాద్ సహ పలువురు నటీనటులు ఇతర కీలక పాత్రల్లో కనిపించారు. ప్రముఖ అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ డైరెక్టర్‌గా వర్క్ చేశారు. అరవింద్ కశ్యప్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేయగా.. సురేష్ మల్లయ్య ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ హొంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల రెమ్యునరేషన్, ప్రమోషనల్ ఖర్చులతో కలిపి రూ. 125 కోట్ల రూపాయలతో రూపొందించినట్లు తెలుస్తోంది. మరి ఫుల్ రన్‌లో కాంతార ప్రీక్వెల్ ఎంతటి వసూళ్లు సాధిస్తుందో వేచి చూడాలి.

# బికినీ అందాలతో రచ్చ చేస్తున్న బాలీవుడ్ నటి.. ఫోటోలు వైరల్!



ప్రస్తుత కాలంలో హీరోయిన్లు ఒకరి తర్వాత ఒకరు గ్లామర్ ప్రదర్శన చేస్తూ సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌ను పెంచుకుంటున్నారు. ఫాలోవర్స్‌ను పెంచుకోవడం అనే మాట అటు ఉంచితే.. ఎక్కువగా వెకేషన్స్‌కి వెళ్తూ అక్కడి వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తూ.. వీరు చేసే సందడి అంతా కాదు. ముఖ్యంగా అక్కడి నుంచి వీరు షేర్ చేసే ఫోటోలు చూస్తే మాత్రం అభిమానులలో సరికొత్త ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి అనడంలో సందేహం లేదు. అంతేకాదు మనకు తెలియని ఎన్నో ప్రదేశాలను ఈ సెలబ్రిటీలు అలా ఫోటోల రూపంలో, వీడియోల రూపంలో అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే వీరికి ఫాలోవర్స్ కూడా భారీగా పెరిగిపోతున్నారు. అలా తమ అందాలతో పాపులారిటీ కూడా దక్కించుకుంటున్నారు ఈ హీరోయిన్స్. ఇదిలా ఉండగా తాజాగా ఇప్పుడు ఎక్కువగా చాలామంది హీరోయిన్లు బికినీ ఫోటోలతో సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్న విషయం తెలిసిందే. ఆ జాబితాలోకి ఇప్పుడు మరో బ్యూటీ కూడా వచ్చి చేరింది. ఆమె ఎవరో కాదు అమైరా దస్తూర్. ఇటీవల మాల్దీవ్స్ కి వెకేషన్స్ కి వెళ్ళిన ఈమె.. అక్కడి నుండి ఒక రిసార్ట్లో ఎంజాయ్ చేసిన ఫోటోలను అభిమానులతో పంచుకుంది. ఇందులో ప్రింటెడ్ ఆరెంజ్ కలర్ బికినీ ధరించి ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. షిప్పులో, స్విమ్ చేస్తూ.. అక్కడి వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తూ.. షేర్ చేసిన ఫోటోలు చూసే అభిమానులకు కూడా ఆహ్లాదకరంగా అనిపిస్తున్నాయని చెప్పవచ్చు. అంతేకాదు ఆమె తిన్న ఫుడ్ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంది అమైరా దస్తూర్. ప్రస్తుతం అమ్మడు షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమైరా దస్తూర్ కెరియర్ విషయానికి వస్తే.. 1993 మే 7వ తేదీన ముంబై మహారాష్ట్రలో జన్మించింది. మోడల్‌గా కెరియర్ ను మొదలుపెట్టిన ఈమె 2013లో హిందీ చిత్రం 'ఇసాక్' ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది. హిందీలోనే కాదు తెలుగు, తమిళ్ భాషల్లో కూడా సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది. 2013లో ఇండస్ట్రీకి పరిచయమైన ఈమె.. 2018లో వచ్చిన 'మనసుకు నచ్చింది' అనే సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది. ఇందులో నిత్యా పాత్ర పోషించి అభిమానులను ఆకట్టుకుంది. ఆ తర్వాత 'రాజుగాడు' అనే తెలుగు సినిమాలో కూడా నటించింది. అంతేకాదు తాను నటించిన తొలి సినిమా ఇసాక్ కోసం ఉత్తమ నటి తొలి పరిచయం విభాగంలో ఫిలింఫేర్ అవార్డ్స్ కి నామినేట్ కూడా అయ్యింది. అలాగే తమిళంలో వచ్చిన తన తొలి చిత్రం 'అనేగన్' సినిమా కోసం కూడా సైమా అవార్డ్స్‌కి ఎంపిక అయింది. చివరిగా భగీర అనే తమిళ చిత్రంలో నటించిన ఈమె.. మూడు వెబ్ సిరీస్లలో కూడా నటించింది. 2022లో చివరిగా తెరపై కనిపించిన దస్తూర్ మళ్లీ అటు సినిమాలలో కానీ ఇటు వెబ్ సిరీస్‌లలో కానీ కనిపించలేదు. ప్రస్తుతం ఇలా వెకేషన్స్ ఎంజాయ్ చేస్తోంది.

# కిరణ్ అబ్బవరం 'కే- ర్యాంప్'.. ఎంత వసూలు చేయాలంటే?



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు కే- ర్యాంప్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. క సినిమాతో రీసెంట్‌గా బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న అబ్బవరం.. ఒక్కసారిగా యమా క్రేజ్ సొంతం చేసుకున్నారు. క కలిసొచ్చిందనే ఉద్దేశంతో ఆ పదం ఇప్పుడు కే- ర్యాంప్ టైటిల్‌లో పెట్టినట్లు ఉన్నారు. జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తున్నారు. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్లపై సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకున్న మూవీ త్వరలో రిలీజ్ కానుంది. దీపావళి కానుకగా అక్టోబర్ 18వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అందుకు తగ్గట్లే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సినిమాను రిలీజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించి థియేట్రికల్ బిజినెస్ కంప్లీట్ చేసినట్లు తెలుస్తోంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్ర (6 ప్రాంతాలు)- రూ.3 కోట్లు సీడెడ్ - రూ.1.25 కోట్లు నైజాం - రూ.2 కోట్లు రెస్టాఫ్ ఇండియా - రూ.45 లక్షలు మొత్తం- రూ.6.75 లక్షలు అయితే కే- ర్యాంప్ థియేట్రికల్ బిజినెస్ అలా జరగ్గా.. బాక్సాఫీస్ వద్ద హిట్ స్టేటస్ సాధించాలంటే సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.8 కోట్ల షేర్ వసూలు చేయాలట. అది చిన్న నంబర్ అనే చెప్పాలి. కిరణ్ అబ్బవరానికి ఇప్పుడు మంచి క్రేజ్ ఉంది. సినిమాకు కనుక పాజిటివ్ టాక్ వస్తే.. రూ.8 కోట్లు వసూలు చేసి క్లీన్ హిట్‌గా నిలవనుంది. కాగా.. మూవీపై ఇప్పటికే ఆడియన్స్‌లో సూపర్ బజ్ క్రియేట్ అయింది. అనౌన్స్మెంట్ నుంచే పాజిటివ్ హైప్ ఏర్పడింది. మేకర్స్ దాన్ని మంచిగా కాపాడుకుంటూ వస్తున్నారు. వరుస అప్డేట్స్‌తో సందడి చేస్తున్నారు. క్రేజీ పోస్టర్స్ ను రిలీజ్ చేస్తున్నారు. అదిరిపోయే సాంగ్స్‌ను ఒక్కొక్కటిగా తీసుకొస్తున్నారు. మ్యూజిక్ లవర్స్‌ను తెగ మెప్పిస్తున్నారు. ఇప్పటికే టీజర్‌తో అలరించగా.. మరికొద్ది రోజుల్లో ట్రైలర్‌ను రిలీజ్ చేయనున్నారు. సినిమాపై మరింతగా బజ్ క్రియేట్ చేసేందుకు ట్రైలర్‌ను కట్ చేసే పనిలో ఉన్నారు. త్వరలో ఎప్పుడు విడుదల చేయనున్నారో చెప్పనున్నారు. ఏదేమైనా మరో 10 రోజుల్లో రిలీజ్ కానున్న కే- ర్యాంప్ ఎంతటి విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

# ప్రజా రవాణాలో ఆర్టీసీ బస్సుల తర్వాత ఆటోలే కీలకం

- బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో ఆటో డ్రైవర్ల సేవలో విజయోత్సవ ర్యాలీ గ్రాండ్ సక్సెస్ - ఆటోలో ప్రయాణించిన వేమిరెడ్డి దంపతులు - కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక రాష్టంలో రహదారులపై గుంతలు పూడ్చడానికి 1400 కోట్లు వెచ్చించాం - అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం - గత ప్రభుత్వ హయాంలో 20 వేలున్న గ్రీన్ ట్యాక్స్‌ను కూటమి ప్రభుత్వం 3 వేలకు తగ్గించింది - ఆటో డ్రైవర్ల కోసం గత ప్రభుత్వం 260 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే... సీఎం చంద్రబాబు 435 కోట్లు వెచ్చించారు - కోవూరు నియోజకవర్గంలో 2,795 మంది ఆటో సోదరులకు 4 కోట్ల19 లక్షల 25 వేల ఆర్థికసహాయం అందించాం - బుచ్చిరెడ్డి పాళెం ఆటో డ్రైవర్ల సేవలో విజయోత్సవ ర్యాలీలో వేమిరెడ్డి దంపతులు - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలిపిన ఆటో డ్రైవర్లు






**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొనేందుకు బుచ్చిరెడ్డిపాళెం పట్టణం టోల్ ప్లాజా వద్దకు చేరుకున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఆటో డ్రైవర్లు మరియు తెలుగుదేశం నాయకులు ఘనస్వాగతం పలికారు. శాలువాలు, పుష్ప గుచ్చాలతో సన్మానించి తమ అభిమానం చాటుకున్నారు. అనంతరం ప్రసన్న అనే మహిళా ఆటో డ్రైవర్ ఆటోలో కూర్చొని ఆటో డ్రైవర్ల సేవలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. అటు టోల్ ప్లాజా నుంచి ఇటు నారాయణాద్రి లే అవుట్ వరకు బుచ్చి పట్టణం మీదుగా దాదాపు 500 లకు పైగా ఆటోలతో ఆటో సోదరులు నిర్వహించిన భారీ ర్యాలీలో సంక్షేమ సారధి చంద్రబాబు జిందాబాద్, వేమిరెడ్డి దంపతుల నాయకత్వం వర్ధిల్లాలి అన్న నినాదాలతో బుచ్చిరెడ్డి పాళెం పట్టణ ప్రతిధ్వనించాయి. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా రవాణా రంగంలో ఆర్టీసీకి ఎంత ప్రాధాన్యత వుందో ఆటో వ్యవస్థ కూడా అంతే ముఖ్యమైందన్నారు. రవాణా కోసం ప్రజలు ఆర్టీసీ బస్సుల తర్వాత ఎక్కువగా ఎక్కేది ఆటోలేనన్నారు. రాష్టం ఆర్థిక ఇబ్బందులలో వున్నా ఆటో సోదరులను ఆదుకోవాలన్న ఏకైక లక్ష్యంతో "ఆటో డ్రైవర్ల సేవలో" పధకాన్ని అమలు చేసి సిఎం చంద్రబాబు నాయుడు కార్మికుల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు 10 వేలు యిస్తే కూటమి ప్రభుత్వం ప్రతి ఆటో డ్రైవర్లకు దసరా కానుకగా ఆటో సోదరుల అకౌంట్లలో 15 వేలు జమ చేసి ఆదుకున్నారనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.90 లక్షల మంది ఆటో సోదరుల ఖాతాల్లో రూ.435 కోట్లు అందజేస్తే ఒక్క నెల్లూరు జిల్లాలోనే 17వేల 409 వేల మందికి 26.11 కోట్లు జమ చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో డ్రైవర్లకు ఆర్థిక చేయూత ఇవ్వాలనే సంకల్పంతో కోవూరు నియోజకవర్గంలో 2 వేల,795 మంది ఆటో సోదరులకు 4 కోట్ల 19 లక్షల 25 వేల ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ఆమె ఆటో సోదరుల పక్షాన ధన్యవాదాలు తెలియచేసారు. 15 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామని పెన్షన్ల పెంపు, దీపం 2 పథకం ద్వారా ఏడాదికి మూడు సిలెండర్లు, అన్నదాత సుఖీభవ, మత్స్యకారసేవలో తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం పేదలను ఆదుకుంటుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లు రోడ్డెక్కాలంటేనే భయపడే పడే పరిస్థితి వుండేదన్నారు.గతంలో 20 వేలున్న గ్రీన్ ట్యాక్స్ ను కూటమి ప్రభుత్వం 3 వేలకు తగ్గించిందన్నారు. ఆటో డ్రైవర్ల కోసం గత ప్రభుత్వం 260 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే... సీఎం చంద్రబాబు గారు.. 435 కోట్లు అందించారన్నారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా అధికారం చేపట్టగానే తొలి సంతకం ద్వారా మెగా డిఎస్సికి శ్రీకారం చుట్టి రాష్ట వ్యాప్తంగా 15,941 మంది ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టిందన్నారు. కోవూరు నియోజకవర్గంలో 67 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారన్నారు. ఆర్థికంగా సవాళ్లున్నా.. ఊహించని స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి అందిస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తూ రాష్టాన్ని అన్ని రంగాల్లో టాప్‌లో నిలిపేలా కష్టపడుతున్న సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి, మంత్రి నారా లోకేష్‌కు అండగా నిలిచి స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చి, వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, బుచ్చి అగ్రికల్చర్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ ఏటూరి శివరామ కృష్ణారెడ్డి, బుచ్చి వైస్ చైర్మన్లు శివకుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్, బుచ్చి రూరల్ మరియు అర్బన్ టిడిపి అధ్యక్షులు బెజవాడ జగదీష్, గుత్తా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు టంగుటూరు మల్లారెడ్డి, కోవూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట టిడిపి అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, శ్రీహరి రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బత్తల హరికృష్ణ, ఎంవి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# 23 మున్సిపల్ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులతో వివిధ శాస్త్ర సాంకేతిక పురోగాభివృద్ధి అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించిన మాజీ చైర్మన్ జి సతీష్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన ఈ సదస్సులో స్వాగత ఉపన్యాసంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. బాలాజీ రావు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో 14 హై స్కూల్స్ ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, అన్ని పాఠశాలలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, ఆట స్థలాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి విద్యా సంవత్సరం జూన్ 12న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్టూడెంట్ కిట్ అందజేస్తూ, ఇస్కాన్ సిటీ వారిచే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తూ, ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ద్వారా రూ.15 వేలతో పాటుగా విజయ దీపిక పుస్తకాలను అందజేస్తామని తెలియజేశారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఈ స్థాయికి చేరుకున్న వారేనని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి నిదర్శనంగా ప్రతి విద్యా సంవత్సరంలో పురోగతి సాధిస్తున్నామని, 2023 – 75. 61%, 2024 – 88.17%, 2025 – 83.58% సాధించడంతోపాటు రాష్ట్రంలోనే 13వ స్థానంలో 85.10 శాతంతో నెల్లూరు టౌన్ నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో 148 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా, ఈనెల 13వ తేదీన నూతన ఉపాధ్యాయులుగా డీఎస్సీ వారిచే పూర్తి చేస్తామని తెలియజేశారు. మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ హమీద్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలను మించిన సూపర్ స్టార్లు లేరు, అసలైన హీరోలు శాస్త్రవేత్తలని అభిప్రాయం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల అభ్యున్నతి కోసం గొప్ప కార్యక్రమం చేపట్టామని, నెల్లూరు జిల్లా మీద ప్రేమను ఈ కార్యక్రమం రూపంలో వ్యక్త పరుస్తున్న సతీష్ రెడ్డికి ధన్యవాదాలను తెలియజేశారు. పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమం అడాప్ట్ చిల్డ్రన్‌లో భాగంగా వి.ఆర్ మున్సిపల్ హై స్కూల్ పిల్లలకు అవసరమైన అన్ని వసతులను కల్పించి ఉన్నతమైన విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథి సతీష్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రామేశ్వరంలోని చిన్న గ్రామంలో ప్రభుత్వ పాఠశాల చదివారని, విద్యతోనే గొప్ప శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతి అయ్యారని తెలిపారు. అదేవిధంగా తాను కూడా గవర్నమెంట్ స్కూలు మహిమలూరు పాఠశాల, విఆర్ కాలేజీలో చదివానని, అబ్దుల్ కలాం వేసిన బీజం వల్ల ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిందని విద్యార్థులకు వివరించారు. మున్సిపల్ విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన కోసం యుద్ధ ట్యాంక్‌ను ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తానని తెలియజేశారు. స్వదేశీ ఆలోచనలతో రూపొందించిన ఆత్మ నిర్భర్ భారత్ ఆయుధాలతో భారత్ వివిధ యుద్ధాలలో గొప్ప విజయం సాధించిందని తెలియజేశారు. బ్రహ్మోస్ క్షిపణిని రష్యాతో కలిసి తయారు చేశామని, బ్రహ్మోస్‌లో సొంతంగా రూపొందించిన సాఫ్ట్వేర్ ఉందని సతీష్ రెడ్డి తెలియజేశారు. బ్రహ్మోస్ క్షిపణితో పాక్‌పై విజయం సాధించామని, భారత దేశానికి ఎటువంటి నష్టం కలగలేదని వివరించారు. భారతదేశంలో క్షిపణులకు నాంది పలికింది అబ్దుల్ కలాం అని, ఈనెల అక్టోబర్ 15న ఆయన పుట్టినరోజు వేడుకలను అన్ని పాఠశాలలో ఘనంగా జరుపుకోవాలని సతీష్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ రెడ్డి పదవ తరగతి పిల్లల నిర్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రాత్రింబవళ్లు కష్టపడి చదవాలని, స్కూలుకు మంచి పేరు తేవాలని, నెల్లూరుకు, రాష్ట్రానికి తద్వారా దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్, డి.ఈ.ఓ. బాలాజీ రావు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, డిప్యూటీ డి.ఇ.ఓ నాయక్, నెల్లూరు అర్బన్ ఎం.ఈ.ఓ.లు తిరపాల్, హమీద్, వివిధ స్కూల్స్‌కు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# 10న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన

## - ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఈ నెల 10వ తేదిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉన్నందున, వారి పర్యటనను విజయవంతం చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. వెంకటాచలం మండలంలోని ఈదగాలి గ్రామంలోని విస్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రానున్న దృష్ట్యా, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా ఎస్పీ అనితా వేజెండ్లతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈదురు బిట్ 2 గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని, అక్కడి నుండి నంద గోకులం లైఫ్ స్కూల్, గోశాల, విస్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్ ప్రాంతాలను పరిశీలించారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయవలసిందిగా పోలీస్ అధికారులకు సూచించారు. ఎవరికి కేటాయించిన విధు లను వారు సక్రమంగా, భాధ్యతతో నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనూష, డిటిసి చందర్, ఆర్ అండ్ బి, విద్యుత్ ఎస్ ఈలు గంగాధర్, రాఘవేందర్, తదితర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టపాసుల గోదాములు, తయారీ కేంద్రాలపై తనిఖీలు చేపట్టండి

## - 48 గంటల్లోపు నివేదిక ఇవ్వాలని అగ్నిమాపకశాఖ అధికారులకు ఆదేశం

## - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రానున్న దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల తయారీ కేంద్రాలు, గోదాములను వెంటనే తనిఖీ చేసి, 48 గంటల్లోగా పూర్తి నివేదికను సమర్పించాలని అగ్నిమాపకశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలులో ఉన్నాయో లేదో సమగ్రంగా పరిశీలించాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డికి కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో బాణాసంచా తయారీ, విక్రయ కేంద్రాలు, గోదాముల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తయారీ కేంద్రాల సమీపంలో పాఠశాలలు లేదా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు లేకుండా చూసుకోవాలని, కేవలం లైసెన్సు పొందినవారే బాణాసంచా తయారీ, నిల్వలు నిర్వహించాలన్నారు. నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

# కూటమి ప్రభుత్వంలో వైద్యం వదిలి మద్యంకు ప్రాధాన్యత

**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** నేదురుమల్లి బంగాళాలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బోలిగల మస్తాన్ యాదవ్ విమర్శించారు.

బుధవారం జరిగిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పై విషప్రచారం అబద్ధపు హామీలతో గెద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం మద్యం వ్యవహారంతో గ్రామస్థాయిలో మహిళలనుఇబ్బందులకు గురి చేస్తున్నారని, 2027లో రాబోవు జెమిని ఎన్నికల్లో టిడిపికి తగిన రీతిలో వారు బుద్ధి చెప్తారని తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి సూచనలతో అందరి సహకారంతో సక్రమంగా నిర్వహిస్తూ పార్టీ పార్టీష్టతకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వెంకటగిరి డక్కిలి బాలాయ పల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# చెత్త రహిత నగరంగా నెల్లూరు

## - 14వ డివిజన్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించిన విబిఆర్

**నెల్లూరు సిటీ, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరాన్ని చెత్తరహిత దోమలరహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఒకరోజు ఒక వీధి పరిశుభ్రం కార్యక్రమంలో భాగంగా నగరంలోని స్థానిక 14 డివిజన్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమం పనులను వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పరిశీలించారు. బుధవారం 16వ డివిజన్ కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి, 15వ డివిజన్ టిడిపి నాయకులు గణేశం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి 14 డివిజన్లో వేమిరెడ్డి పర్యటించారు. ఒకరోజు ఒక వీధి పరిశుభ్ర కార్యక్ర మాన్ని ఆయన స్వయంగా పరిశీలించి చాలా చక్కగా చేస్తున్నారని, రోడ్డు మీద ఉన్నగడ్డిని తొలగించడం ,బ్లీచింగ్ చెల్లించడం, దోమల నివారణకు పాగింగ్ చేయించడం, పవర్ స్ప్రేతో మందుని పిచికారి చేయించడం, కాలువల్లో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వేయడం స్తంభాల చుట్టూ చెట్ల చెట్టు మట్టిని తొలగించడం, ట్రాన్స్ఫార్మ్ దగ్గర ఉన్న మట్టిని గాని మళ్ల చెట్లను గాని కరెంట్ ఆపిక్లీన్ చేయడం,చాలా చక్కగా చేస్తున్నారని ప్రతి ఒక్కరు కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డిని ఆదర్శంగా తీసుకొని ఈ విధంగా చేయాలని వేమిరెడ్డి సూచించారు. నెల్లూరు నగరాన్ని దోమలేని నగరంగా చేయాలంటే ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలని రోడ్డు మీద ఎక్కడా చెత్త వేయ కుండా చూడాలని మీ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉంటారని అని వేమిరెడ్డి అన్నారు. మంత్రివర్యులు నారాయణ నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేస్తున్నారని అలాగే నెల్లూరు నగరాన్ని దోమల రహిత నగరంగా తీర్చిదిద్దిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అడ్వైజర్ ప్రతాప్ రెడ్డి నగరపాలక సంస్థ శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ సెక్రటరీలు వర్షిత రాణి, కావ్యాలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి జీఎస్‌టీ 2.0 ఫలాలు అందాలి

**- జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో దేశాభివృద్ధికి బాటలు - కేంద్రం మన కోసం తీసుకు వచ్చిన విప్లవాత్మక సంస్కరణలు జీఎస్‌టీ 2.0 - ప్రజలు నిత్యం ఉపయోగించే అన్నివస్తువులపై తగ్గిన రేట్లు - ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు సారథ్యంలో నెల రోజులు అవగాహన కార్యక్రమాలు - సామాన్యులకు జీఎస్‌టీ 2.0తో ఎంతో ప్రయోజనం - మీ పరిధిలో ప్రతి ఒక్కరికీ జీఎస్‌టీపై అవగాహన కల్పించండి - 16న కర్నూలులో జీఎస్‌టీపై ప్రధాని మోడీ సభ**








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఎస్‌టీ 2.0 సంస్కరణలు దేశాభివృద్ధికి బాటలు వేస్తాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జీఎస్‌టీ సంస్కరణలతో ప్రతి ఇంట్లో దీపావళి కాంతులు వెల్లివిరుస్తున్నాయని పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు జిల్లా సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పీ.ఎస్.ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన జీఎస్‌టీ 2.0 అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీఎస్‌టీ తగ్గింపుతో ప్రజలకు, వ్యాపారులకు కలిగే మేలును ఆయన వివరించారు. ముందుగా సభా ప్రాంగణానికి చేరుకున్న ఎంపీ వేమిరెడ్డి.. జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ కిరణ్ కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా 'వుయ్ సపోర్ట్ జీఎస్‌టీ' అనే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబు ఆదేశాలతో జీఎస్టీ పై ప్రచారం చేయడం సంతోషంగా ఉందన్నారు. దేశం ప్రపంచ శక్తిగా ఎదుగుతున్న కీలక సమయంలో కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించేలా జీఎస్‌టీ సంస్కరణలు చేపట్టిందన్నారు. ఈ విషయంలో ప్రధాని మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం జీఎస్‌టీపై దాదాపు 500 సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. 2017లో నాలుగు స్లాబులతో జీఎస్‌టీని ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం.. దాన్ని మరింత సులభతరం చేస్తూ రెండు స్లాబులతో %+ూ% 2.0 ను ప్రవేశపెట్టిందన్నారు. పేదలకు మరింత లబ్ధి చేకూరేలా తీసుకున్న నిర్ణయంతో దేశప్రజలకు దాదాపు 2 లక్షల కోట్ల మేర లబ్ధి కలుగుతుందని చెప్పారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వానికి 8,000 కోట్ల రూపాయల మేర నష్టం కలుగుతున్నా.. ప్రజా సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు జీఎస్‌టీని ప్రోత్సహిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయం, చేతివృత్తులు, పర్యాటకం, ఆరోగ్యరంగం వంటి అన్ని కీలక రంగాలు దీనితో లాభపడుతున్నాయని వివరించారు. జీఎస్‌టీ 2.0పై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీ వేమిరెడ్డి సూచించారు. ఇది ప్రతి ఒక్కరితో ముడిపడిన కార్యక్రమమని, ఇందులో ప్రజల భాగస్వామ్యం తప్పకుండా ఉండాలన్నారు. ఎవరి పరిధిలో వారు.. వీలైనంత మందికి జీఎస్‌టీ 2.0పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరు మరో 10 మందికి అవగాహన కల్పిస్తే.. వారు మరికొందరికి అవగాహన కల్పించేలా చూడాలన్నారు. తమకు అందుతున్న మేలును వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. గతంలో ఆరోగ్య, జీవిత బీమా మీద 18% జిఎస్‌టి ఉంటే ఇప్పుడు నుంచి పూర్తిగా తొలగించారని, ప్రతి ఒక్కరూ హెల్త్ ఇన్స్యూరెన్స్ తీసుకోవాలని సూచించారు. క్యాన్సర్ మందులు, ఇతర అత్యవసర మందులపై జీఎస్‌టీ ఇప్పుడు పూర్తిగా తొలగించడంతో ప్రజలకు మరింత అందుబాటులో ఉంటున్నాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఈ సంస్కరణలను స్వాగతిస్తూ, రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జీఎస్‌టీ అంశంపై ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోడీ కర్నూలులో పర్యటిస్తున్నట్లు వెల్లడించారు. జాయింట్ కమిషనర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. తమ ఆహ్వానం మేరకు అడిగిన వెంటనే జీఎస్‌టీ 2.0 అవగాహన కార్యక్రమానికి హాజరైన ఎంపీ వేమిరెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవా దాలు తెలియజేశారు. కార్యక్రమానికి ఎంపీ అందించిన సహాయ సహకారాలను కొడియాడారు. జీఎస్‌టీ 2.0పై ఇప్పటికే క్షేత్రస్థా యిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరిం చారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు దశల వారీగా కార్యక్ర మాలు అమలు చేస్తున్నామన్నారు. జీఎస్‌టీ వల్ల ప్రజలకు ఎంతో లబ్ధి కలుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే తమ శాఖ తరఫున రేట్ల బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఇందులో ప్రజలను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

రంగాలవారీగా జీఎస్‌టీ లబ్ధిని ఆయన సభ ముందుం చారు. కార్యక్రమంలో జిల్లా సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్, ప్రోగ్రాం కన్వీనర్ కృష్ణమోహన్, మదీన వాచ్ అధినేత ఇంతియాజ్, ఏసీసీ రాష్ట్ర అధ్యక్షులు రంగయ్య నాయుడు, నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులపై దురుసు ప్రవర్తన

**- ఆసుపత్రి ఎదుట నిరసనకు దిగిన కార్మికులు - గొడవ వెనుక కారణాలేమిటి - గొడవ విషయంలో అలిగిన టీడీపీ నేత**

**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు కుమారుడికి సంబంధించిన ఓ ప్రైవేట్ హాస్పిటల్ వద్ద హై టెన్షన్ నెలకొంది. పారిశుద్ధ కార్మికులకు హాస్పిటల్ యాజమాన్యానికి మధ్య వివాదం జరిగింది. పారిశుధ్య కార్మికులపై వైద్యులు దురుసుగా ప్రవర్తించడంతో వివాదం కాస్త ముదిరింది. వివాదానికి గల కారణాలు ఇలా ఉన్నాయి.. బుచ్చి మున్సిపాలిటీకి చెందిన చెత్త ట్రాక్టర్లు చెత్త సేకరణ చేస్తున్నాయి..ఈ నేపథ్యంలో చెత్త టాక్టర్‌ను హాస్పిటల్ వద్ద పారిశుధ్య కార్మికులు నిలిపారు.. ఎంతసేపటికి టాక్టర్ తొలగించకపోవడంతో హాస్పిటల్ యాజమాన్యం పారిశుద్ధ కార్మికులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆగ్రహానికి గురైన హాస్పిటల్ యాజమాన్యం చెత్త టాక్టర్ గాలి తీసేందుకు ప్రయత్నించడంతో రచ్చ మొదలైంది.కమిషనర్ బాలకృష్ణ సూచనల మేరకు పారిశుధ్య కార్మికులు హాస్పిటల్ ఎదుట చెత్తను పోసి నిరసన చేపట్టారు. హాస్పిటల్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వివాదం ముదరడంతో పలువురు కౌన్సిలర్లు రంగంలోకి దిగి పారిశుధ్య కార్మికులకు నచ్చచెప్పారు. హాస్పిటల్ యాజమాన్యం






పారిశుధ్య కార్మికులకు క్షమాపణ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. హాస్పిటల్ ఎదుట పోసిన చెత్తను వెంటనే తొలగించి కార్మికులు అక్కడినుండి వెనుదిరిగారు...

**వివాదంపై స్థానికుల భిన్నాభిప్రాయాలు**

ఈ వివాదంలో స్థానికులలో భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కమిషనర్ బాలకృష్ణకు టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులకు వివాదం జరగడాన్ని స్థానిక ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఆ వివాదాన్ని దృష్టిలో పెట్టుకొని కమిషనర్ బాలకృష్ణ పారిశుధ్య కార్మికులతో ఈ కార్యక్రమానికి తరలారని జోరుగా చర్చ జరుగుతుంది. పట్టణ అధ్యక్షుడిగా గుప్తా శ్రీనివాసులు ఎదుగుదలను చూసి ఓర్చుకోలేక పార్టీలోని కీలక నేత ఈ వివాదం వెనుక ఉన్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ విషయాన్ని పసిగట్టిన పార్టీ ముఖ్య నేతలు పట్టణ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులతో చర్చలు జరిపారు. కమిషనర్ వైఖరిపై గుర్రుగా ఉన్న శ్రీనివాసులు ఎమ్మెల్యే కార్యక్రమానికి సైతం డుమ్మా కొట్టారు. దీంతో విషం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో కమిషనర్ బాలకృష్ణను మందలించినట్లు తెలుస్తోంది. పార్టీలోని నేతలతో ఇలానే వ్యవహరిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారట.

దీనిపై పట్టణ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తమ నివాసనికి పిలిపించుకుని బుజ్జగించినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ రగడతో మండలంలోని టిడిపి నాయకులలో ఆవేదన మొదలైంది. పట్టణ అధ్యక్షుడుకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే సామాన్య కార్యకర్తలకు పరిస్థితి ఏమిటని గుసగుసలాడుతున్నారు.ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకులకు అధికారులకు మధ్య సమన్వయం చేయడంలో విఫలమవుతున్నారని పలువురు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు.ఈ వివాదానికి ఎమ్మెల్యే ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడక తప్పదు.

# వక్ఫ్ ఆస్తులను కాపాడటం ఎంత ధర్మమో వాటి ద్వారా ఆదాయాన్ని పెంచడం కూడా అంతే ధర్మం

**- 13 ఎకరాల భూమిలో కేవలం జంగిల్ క్లియర్ చేసి ప్రహరీ గోడ నిర్మించబోతున్నాం - దీనిపై ఎటువంటి ప్రణాళిక రచించలేదు - స్థానిక కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలతో చర్చించి ప్రణాళిక రచిస్తాం - నేను చైర్మన్ అయ్యాక వక్ఫ్ బోర్డు ఆదాయాన్ని రెండింతలు పెంచాను - ఆదాయాన్ని పెంచకపోతే సంపద సృష్టించకపోతే ముస్లిం సమాజం ఎలా బాగుపడుతుంది.?- రాష్ట్రవ్యాప్తంగా 28 ప్రదేశాల్లో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ప్రారంభిస్తున్నాం - నవంబర్ 11 న చంద్రబాబు చేత వర్చువల్ గా ప్రారంభిస్తాం - 15 కోట్ల రూపాయలతో వచ్చే ఏడాది నుంచి 500 మంది ముస్లిం విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తాం. - భవిష్యత్తులో ముస్లిం విద్యార్థులకు ఉచితంగా ఐఏఎస్ శిక్షణ అందిస్తాం - పలు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం సీనియర్ న్యాయవాదులను నియమించాం - షేక్. అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని పరమేశ్వరి నగర్‌లో గల జామియా మసీదుకు చెందిన 13.30 ఎకరాల వక్ఫ్ భూమిని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టీడీపీ ముస్లిం నాయకులు, మతపెద్దల తో కలిసి పరిశీలించారు. పరిశీలించిన అనంతరం అబ్దుల్ అజీజ్ మీడియా తో మాట్లాడుతూ, గతంలో పూర్వీకులు రాష్ట్ర వ్యాప్తంగా 67 వేల ఎకరాల భూమిని వక్ఫ్ చేశారని, వక్ఫ చేయడం అంటే దేవుడికి ఇవ్వటం అని తెలిపారు. వక్ఫ్ సంస్థలు వాటి యొక్క భూములతో ఆదాయాన్ని పెంచుకొని సంస్థలు నడుపుకోవటానికి పూర్వీకులు వనరులను ఇచ్చారని తెలిపారు. కాలక్రమమైన పలువకు భూముల ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి ఫరూక్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పరిరక్షణ చేపడుతున్నామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించి వాటి ద్వారా ఆదాయాన్ని పెంచి పేద ముస్లింల అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. వనరులను ఉపయోగించి ఆదాయాన్ని పెంచి పేద ముస్లింల అభ్యున్నతికి కృషి చేయాలని ముస్లిం సమాజ అభివృద్ధికి తోడ్పడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. వక్ఫ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పైన ఉందని తెలిపారు. నెల్లూరులోని 13.30 ఎకరాల వక్ఫ భూమిని ప్రభుత్వ సహకారంతో సర్వే చేయించామని, దాదాపు 13 ఎకరాల భూమి అలానే ఉందని అక్కడక్కడ కొద్దిగా ఆక్రమణకు గురైందని దానిని ఏం చేయాలో ఆలోచిస్తామని తెలిపారు. ప్రస్తుతం 13 ఎకరాలను కేవలం జంగిల్ క్లియర్ చేసి ప్రహరీ గోడ నిర్మిస్తున్నామని, ఈ స్థలంలో ఎలా అభివృద్ధి చేయాలో స్థానిక కలెక్టర్ ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. దేవుడి ఆస్తులను అందరూ చౌకగా కోరుకుంటారని దేవుడి ఆస్తులను ప్రీమియంగా తీసుకోవాలని అప్పుడే దేవుడి అనుగ్రహం కూడా ఉంటుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కమర్షియల్ ప్రాపర్టీస్‌ని చౌకగా ఇవ్వకూడదని ఆదాయాన్ని పెంచి ముస్లిం సమాజానికి ఉపయోగపడాలని ముతవల్లీలకు సూచించారు. ఆదాయం పెంచకపోతే సంపద సృష్టించకపోతే సమాజం ఎలా బాగుపడుతుందని ఉన్న ఆస్తులను ఇలా వైరాగ్యంగా వదిలేస్తే సమాజం ఎలా బాగుపడుతుందని అన్నారు. వక్ఫ్ ఆస్తులను కాపాడటం ఎంత ధర్మమో, వాటి ద్వారా ఆదాయాన్ని పెంచడం కూడా అంతే ధర్మమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28 ప్రదేశాల్లో తాలిం ఏ హునర్ పేరుతో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ప్రారంభించబోతున్నామని, నవంబర్ 11న చంద్రబాబు చేత వాటిని వర్చువల్‌గా ప్రారంభిస్తామని తెలిపారు.

గతంలో లేని విధంగా వక్ఫ బోర్డు భూములకు ఆన్లైన్ ఆక్షన్ వేసామని అన్నారు. తాను ఒక బోర్డ్ చైర్మన్ అయ్యాక ఆదాయాన్ని రెండింతలు పెంచానని తెలిపారు. 13 ఎకరాల్లో పని ప్రారంభించేటప్పుడే అధికారులు ప్రణాళికను తెలిపారని అన్నారు. 13 ఎకరాల భూమి గుంటలు గుంటలుగా ఉందని గుంతలను పూడుస్తామని, తెలిపారు. రాబోవు మార్చి నుంచి వక్ఫ్ బోర్డు తరుపున 15 కోట్ల రూపాయల ఖర్చుతో 500 మందికి ఉచిత ఇంటర్మీడియట్ విద్య అందించబోతున్నామని తెలిపారు. ఢిల్లీలోని ఐఏఎస్ అకాడమీలను పరిశీలించానని, రాబోవు రోజుల్లో ముస్లిం విద్యార్థులకు ఉచిత ఐఏఎస్ కోచింగ్ అంది స్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలు వక్ఫ ఆస్తులను కాపా డేందుకు సీనియర్ లాయర్లను పెట్టి సిట్టింగ్ కు 5 లక్షల ఖర్చుపెట్టి పోరాడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముస్లిం నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

# మన మెడికవర్ హాస్పటల్‌లో ఉచిత బెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని మెడికవర్ హాస్పిటల్ నందు పింక్ మంత్‌గా ప్రసిద్ధిగాంచిన క్యాన్సర్ అవగాహన సందర్భంగా నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ నందు ఈనెల అనగా అక్టోబర్ 31వ తేదీ వరకు ఉచితంగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అనగా మామోగ్రఫీ, పాప్స మియర్ పరీక్షలు, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, క్యాన్సర్ స్పెషలిస్ట్ కన్సల్టేషన్ ఉచితంగా చేస్తున్నట్లు తెలియజేశారు ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల సూపర్డెంట్ మాధవి, నగరానికి చెందిన డాక్టర్ యశోదర, హైకోర్టు న్యాయవాది దీప్తి లక్ష్మి, డాక్టర్ లోకేశ్వరి, డాక్టర్ రంజిత్ రెడ్డి, సెంటర్ హెడ్ పవన్, ఉమెన్స్ క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి, తదితరులు పాల్గొని క్యాన్సర్ వ్యాధి పట్ల ఎటువంటి పరిష్కారాలు పొందాలి, ఏ పరిస్థితులలో డాక్టర్లను సంప్రదించాలి అనే విషయం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 31 వరకు నమోదు చేసుకున్న వారిని తర్వాత కూడా పరీక్షిస్తామని అందుకుగాను 04068334455 నెంబర్‌ను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

# న్యాయవాదిపై చర్యలకు డిమాండ్

**అమలాపురం, (రాజధాని వార్తలు):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నాన్ని అమలాపురంలో బిఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గెడ్డం సంపాదరావు ఖండించారు. బుధవారం బీఎస్పీ నేతలతో కలసి నిరసన వ్యక్తం చేశారు.దాడికి యత్నించిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నేతలు కొనాలా ప్రకాష్, వడ్డీ వీరాస్వామి, పెయ్యాల ప్రతాప్, అమలాపురం బిస్పి ఇంచార్జి పొలామూరి మోహన్, వాకాపల్లి హరీష్, కూరటి చంద్రరావు, గుట్టల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత : ఎఫ్ ఆర్ ఓ సౌజన్య రెడ్డి



**దొరవారి సత్రం, (రాజధాని వార్తలు):** ప్రకృతిలో జీవరాసులైన వన్య ప్రాణులను సంరక్షణ బాధ్యత మనందరిపై ఉందని వన్యప్రాణి విభాగం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సౌజన్య రెడ్డి వెల్లడించారు. బుధవారం విదేశీ పక్షుల విడిది కేంద్రమైన నేలపట్టు పక్షుల కేంద్రంలో" వైల్డ్ లైఫ్ వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని" ఏర్పాటు చేశారు. ఏకొల్లు ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేచర్ క్యాంప్ నిర్వహించి ప్రకృతిలో వన్యప్రాణులు పాత్ర– వాటి ఉపయోగాలను గురించి విద్యార్థులకు క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ ఆర్ వో మాట్లాడుతూ ప్రకృతి నేస్తాలైన పలురకాల జంతు పక్షి జాతులు గురించి అవగాహన కల్పించారు. మన నేలపట్టు పక్షుల కేంద్రం విదేశీ పక్షుల పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అదేవిధంగా పులికాట్ పక్షుల కేంద్రంలో ఎన్నో రకాలైన విదేశీ, స్వదేశీ పక్షులకు ఆహార భాండాగారంగా, నివాసయోగ్యానికి అనువైన ప్రాంతంగా పులికాట్ సరస్సులో ఎన్నో వేల రకాల పక్షుల నివాసంగా ఉందని వివరించారు. జంతు జాతులు, పలు రకాల అడవుల వలన ఎలాంటి ఉపయోగాలను పొందుతున్నామో వివరించారు. ఈ కార్యక్రమంలో నేచర్ గైడ్ హుస్సేన్ మాట్లాడుతూ నేలపట్టు పక్షుల కేంద్రానికి పక్షుల రాక ఆసన్నమైందని తెలిపారు పక్షుల కేంద్రం 1200 వందల ఎకరాల విస్తీర్ణంలో 600 చదరపు కిలోమీటర్లు పరిధిలో నేలపట్టు పక్షుల కేంద్రం ఏర్పాటై ఉందని తెలియజేశారు. రాష్ట్రంలో ప్రాముఖ్యత సంతరించుకుంటున్న పక్షుల పర్యాటక కేంద్రాల్లో నేలపట్టు, పులికాట్ సరస్సులు ఎందరో పర్యాటకులకు ఆహ్లాదం, ఆనందాన్నిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రకృతి ప్రేమికులుగా అడవులను పరిరక్షించడంతోపాటు, వన్యప్రాణులను కూడా సంరక్షించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రకృతి– వన్యప్రాణుల సంరక్షణ – వాటి ప్రాధాన్యతను గురించి ఎస్ఏ, క్విజ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. గెలుపొందిన 1) కె.చరణ్ రితేష్ (ప్రథమ బహుమతి) 2) సేవిత్ (ద్వితీయ) 3) సిహెచ్ షణ్ముఖ్ (తృతీయ) బహుమతులను పొందారు. ఆటలు, పాటలు, కోలాటాల నృత్యాలతో ఈ కార్యక్రమం ఆనందంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్ ఎస్ ఓ బాలయ్య, ఎఫ్ బి ఓ రాజేశ్వరి భాయి సింగ్, నేలపట్టు నేచర్ గైడ్ కన్నలి హుస్సేన్, ఏకొల్లు ఉన్నత పాఠశాల టీచర్ లక్ష్మీపతి, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# తపాలా బిళ్ళల సేకరణ మంచి అలవాటుగా మార్చుకోవాలి : డిఎఫ్ఓ.





**కాకినాడ, (రాజధాని వార్తలు):** సాంకేతికత పెరుగుతున్న క్రమంలో ప్రతిఒక్కరూ తపాలా బిళ్ళల సేకరణ మంచి అలవాటుగా మార్చుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్. రామచంద్రరావు సూచించారు. స్థానిక సినిమా రోడ్డులోని సూర్య కళామందిరంలో బుధవారం జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.రామచంద్రరావు పిలోత్సవం-2025 "జిల్లా స్థాయి పిలాటలిక్ ఎగ్జిబిషన్ (తపాలా బిళ్ళల ప్రదర్శన)" కార్యక్రమం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమమునకు అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిలటలీ), ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్, విజయవాడ జీ. శివ నాగరాజు మాట్లాడుతూ మొబైల్ ఫోనులు, అంతర్జాలం వేగముగా విస్తరించి, వ్యక్తిగత ఉత్తరాలు పూర్తిగా అం తరించిపోయే ఈ దశలో కూడా పిలాటలీ అభిరుచి గల అభిమానులు, ఔత్సాహికులు ఒకే వేదికపై తరచూ ఇలా ప్రదర్శనల ద్వారా ఈ కళకు జీవం పోస్తున్నారని కొనియాడారు. అలాగే పోస్టల్ స్టాంపులు విద్యార్థులలో ఎంతో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. ముఖ్య అతిథి జిల్లా అటవీ శాఖా ధికారి రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ఫిలాటలీ అభిరుచి అతి ప్రాచీనమైనదని, తపాలా శాఖ తరచుగా విడుదల చేసే స్టాంపుల వలన ఈ కళ అజరామరంగా భావితరాలకు అందాలని ఆకాంక్షించారు. కాకినాడ డివిజనల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ శాఖచే స్వయంగా నిర్వహింపబడుతున్న ఫిలాటలిక్ ఎగ్జిబిషన్ అని, కాకినాడలో గల అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ అరుదైన తపాలా బిళ్ళల ప్రదర్శనను తిలకించి ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమములో కాకినాడ పోస్టల్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ (హెడ్ క్వార్టర్స్) గంటి రామకృష్ణ, పి.వి.రమణమూర్తి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ (రెగ్యులర్), సామర్లకోట అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ డి. అనిల్ అంబేద్కర్ కుమార్, ముదుగు లక్ష్మణ్ కుమార్, ఇన్స్పెక్టర్ పోస్ట్స్, సౌత్ సబ్ డివిజన్, పెద్దాపురం పోస్టల్ ఇన్స్పెక్టర్ బి.బ్రహ్మం నాయక్, పబ్లిక్ గ్రీవెన్సెస్ ఇన్స్పెక్టర్ బి.జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోస్టల్ స్టాంపుల ప్రదర్శనకు వివిధ పాఠశాలల విద్యార్థులు, ఔత్సాహికులు, పిలాట లిస్ట్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# సీజెఐపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## - ఏపీ రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ శంకర్ నాయక్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సిజెఐ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు, గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లి నగరంలో ప్రవేట్ హెూటల్ నందు జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయి (సిజెఐ) పై జరిగిన దాడి ఘటనను మేము తీవ్రంగా ఖండిస్తు న్నాము అని తెలిపారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు ఇది తీరని అవమానం, న్యాయస్థానాల గౌరవం కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఈ దాడి ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే ప్రయత్నం అని మేము భావిస్తున్నాము. న్యాయవ్యవస్థపై విశ్వాసం కలిగి ఉన్న ప్రతి పౌరుడు ఈ దాడిని తీవ్రంగా ఖండించాలి అని పిలుపునిచ్చారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మేము కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) నాయకులు పాత్లావత్ దుర్గ నాయక్, ఇస్లావత్ హనుమంతు నాయక్, జరపల కృష్ణ నాయక్, మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్‌ని కలిసిన పురుషోత్తం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ నెల్లూర్ నగరానికి రావడం జరిగింది. అఖిల భారత బహుజనుల సంక్షేమ సంఘం నెల్లూరు పట్టణ అధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నేపల్లి దాస్‌లు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సీలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను బలోపితం చేయాలని కోరారు. ఎస్సీలకు భూమి, ఇల్లు లేని నిరుపేదలందరికీ భూమి, ఇల్లులు ఇవ్వాలన్నారు. నేటికీ రాష్ట్రంలో దళితులను దేవాలయాలలోకి గుళ్ళల్లోకి ప్రవేశం లేకుండా చేశారనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దళితుల్లో చాలా మార్పులు వచ్చాయనీ, అన్ని మార్చుకుంటూ వస్తూ ఈ దేవాలయాలలోకి ప్రవేశాన్ని అగ్రవర్గానికి చెందినటువంటి వ్యక్తులు అడ్డుకోవడం సమంజసం కాద న్నారు. దళితులందరికీ దేవాలయాలలోకి ప్రవేశం ఉండే లాగా రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవోను జారీ చేసి దళితులను పగడ్బందీగా దేవాలయాల ప్రవేశానికి కృషి చేయాలని వినతి పత్రం తెలియజేశారు. వెంటనే రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ సానుకూలంగా స్పందించి అన్నీ ఒక్కటిగా కాకుండా ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ వస్తానని హామీ ఇచ్చారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan